ప్రజాశక్తి

మంగళవారం 30 డిసెంబర్ 2025

12 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

బంద్‌పై ఉక్కుపాదం

- ★ భారీగా పోలీసుల మోహరింపు
- ★ దుకాణాలు తెరవాలని యజమానులకు బెదిరింపులు
- ★ డిఇఒ, ఎంఇఒల ద్వారా విద్యా సంస్థలకు మెసేజ్‌లు
- ★ పలు గ్రామాల నుండి తరలివచ్చిన ప్రజలు
- ★ సెక్షన్ 30 అమల్లో ఉందంటూ ఎక్కడికక్కడ అడ్డుకున్న పోలీసులు
- ★ సిపిఎం లోకనాథం, కోటేశ్వరరావు సహా 26 మంది నేతల అరెస్టు

నక్కపల్లిలో లోకనాథంను చుట్టుముట్టి అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- నక్కపల్లి, ఎస్.రాయవరం

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజుపై ప్రభుత్వం పిడి యాక్ట్ పెట్టి అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాల్లో సోమవారం చేపట్టిన బంద్‌పై పోలీసులు ఉక్కు పాదం మోపారు. బంద్‌కు ప్రజలు, దుకాణాల యజమానులు స్వచ్ఛందంగా సహకరించగా పోలీసులు నిర్బంధాన్ని ప్రయోగించారు. నక్కపల్లిలో సిపిఎం కార్యాలయం నుండి ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కె. లోకనాథంతో పాటు పలువురు పార్టీ ప్రజా సంఘాల నాయకులు, అసంఘటిత రంగ కార్మికులు బంద్ చేపట్టేందుకు ర్యాలీగా బయలుదేరి వెళుతుండగా డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ జె.మురళి ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకున్నారు. చట్టానికి లోబడే బంద్ చేపడతామని, స్వచ్ఛందంగా బంద్ చేపట్టేందుకు షాప్ యజమానులు, ప్రజలు ముందుకు వచ్చారని, శాంతియుతంగానే బంద్ నిర్వహిస్తామని లోకనాథం పోలీసులకు చెప్పినప్పటికీ వారు ఒప్పుకోలేదు. సెక్షన్ 30 అమలులో ఉన్నందున అనుమతి

మిగతా 2లో..

అడ్డరోడ్డులో ప్రదర్శనగా వెళ్తూ బంద్ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజలకు ధన్యవాదాలు : లోకనాథం

బంద్‌పై ప్రభుత్వం, పోలీసులు నిర్బంధం ప్రయోగించినా ప్రజలు, వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్‌కు సహకరించడం పట్ల సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం ధన్యవాదాలు తెలియజేశారు. అప్పలరాజు పోరాటాలు చేసిన అన్ని గ్రామాల నుండి ప్రజల బంద్‌కు తరలివస్తుండగా పోలీసులు గ్రామాలకు వెళ్లి బెదిరింపులకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఇటువంటి బెదిరింపులతో ఉద్యమాలు ఆపలేదని స్పష్టం చేశారు.

ఆద్యంతం ఉత్సాహం.. ఉత్తేజం

- ★ మూడో రోజు 'శ్రామిక ఉత్సవ్'లో పండగ సందడి
- ★ అభ్యుదయ, విప్లవ సినీ గీతాలాపన
- ★ చైతన్యం నింపిన డాక్టర్ సుద్దాల అశోక్ తేజ
- ★ ఎగ్జిబిషన్లు, పుస్తక ప్రదర్శనకు పోటెత్తిన ప్రజానీకం

సుద్దాల అశోక్ తేజ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న తపన్‌సేన్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

సిఐటియు 18వ అఖిల భారత మహాసభ సన్నద్ధంగా సాగర తీరంలో తలపెట్టిన 'శ్రామిక ఉత్సవ్' అత్యంత ఉల్లాసభరితంగా, ఉత్సాహపూరితంగా సాగుతోంది. నగరంలోని ఆర్‌కె బీచ్ ఎయు కన్వెన్షన్ సెంటర్ వెనుక ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఈ నెల 27న ప్రారంభమైన ఈ ఉత్సవ్ ప్రాంగణం రోజు రోజుకూ పండగ వాతావరణాన్ని సంతరించుకుంటోంది. మూడో రోజు సోమవారం సాయంత్రం సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి హెచ్.నర్సింగరావు అధ్యక్షతన 'స్త్రీ పురుష సమానత్వం' థీమ్‌తో జరిగిన సభకు

మిగతా 2లో..

నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్న కేరళ కళాకారులు

మంటల్లో కాలిపోయిన బోగీలు

ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌లో మంటలు

రెండు ఎసి బోగీలు ఆహుతి మంటల్లో చిక్కుకొని ఒకరు మృతి

▶ వార్త మెయిన్ పేజీలో

లక్ష్మీనగర్ మురికివాడ వాసులకు ఇళ్లు నిర్మించి ఇస్తాం : మంత్రి నారాయణ

▶ వార్త 2లో..

నేడు జెడ్‌పి సర్వసభ్య సమావేశం

▶ వార్త 2లో..

1 నుండి 10 జోన్లగా జివిఎంసి కార్యకలాపాలు

▶ వార్త 2లో..

మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ & రీసెర్చ్ ఇనిస్టిట్యూట్

ఆంధ్రప్రదేశ్‌లో తొలి మరియు ఏకైక

టోమోథెరపీ RADIXACT X9

(Advanced Precision Adaptive Radiotherapy)

సేవలు ప్రారంభం



20 YEARS OF EXCELLENCE IN CANCER CARE

ప్రారంభోత్సకులు

ముఖ్య అతిథి:

శ్రీ మతుకుమిల్లి శ్రీభరత్ గారు

గౌరవనీయ పార్లమెంట్ సభ్యులు, విశాఖపట్నం

గౌరవ అతిథులు

శ్రీ వెలగపూడి రామకృష్ణ బాబు గారు
గౌరవనీయ శాసనసభ్యులు,
విశాఖపట్నం - తూర్పు

శ్రీ గంటా శ్రీనివాసరావు గారు
గౌరవనీయ శాసనసభ్యులు,
భీమిలి

శ్రీ పెన్మెత్స విష్ణు కుమార్ రాజు గారు
గౌరవనీయ శాసనసభ్యులు,
విశాఖపట్నం - ఉత్తరం

శ్రీ పి. జి. వి. ఆర్. నాయుడు గారు
(గణబాబు)
గౌరవనీయ శాసనసభ్యులు,
విశాఖపట్నం - పడమర

www.mgcancerhospital.com

మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ & రీసెర్చ్ ఇనిస్టిట్యూట్

1/7, ఎంవిపి కాలనీ, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ - 530017

0891-2878787

+91 8341033744

మురికివాడలో పర్యటిస్తున్న మంత్రి నారాయణ

లక్ష్మీనగర్ మురికివాడ వాసులకు ఇళ్లు నిర్మించి ఇస్తాం : మంత్రి నారాయణ

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : విశాఖ దక్షిణ నియోజకవర్గంలోని అత్యంత వెనుకబడిన మురికివాడుగా గుర్తింపు పొందిన వెలంపేట లక్ష్మీనగర్ మురికివాడలో నివసిస్తున్న 177 కుటుంబాల వారికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చర్చించి వీలైనంత త్వరగా ప్రత్యేక ప్రాజెక్టుగా పక్కా గృహాలను నిర్మించి ఇవ్వడం జరుగుతుందని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ హామీ ఇచ్చారు. సోమవారం ఉదయం ఆయన లక్ష్మీ నగర్ స్లమ్ ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించారు. ముఖ్యమంత్రి ఆదేశం మేరకు తాను ఈ మురికివాడకు స్వయంగా వచ్చి, ఇక్కడ నివసిస్తున్న వారి పరిస్థితులను తెలుసుకోవడం జరిగిందని చెప్పారు. ఇక్కడ చాలా సంవత్సరాలుగా నివసిస్తున్న 177 కుటుంబాల వారి పరిస్థితి అత్యంత దారుణంగా ఉందన్నారు. వీరికి ఇళ్ల నిర్మాణంపై ఆలోచన చేస్తున్నామన్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా మురికివాడ ప్రాంతాలు కలిగి ఉన్న విశాఖ నగరంలో నిర్వాసితులకు తక్షణమే ఇళ్ల నిర్మాణాలు చేపట్టే విధంగా ముఖ్యమంత్రి ఆదేశించారని, దీనికి సంబంధించి ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నట్లు మంత్రి నారాయణ తెలిపారు. విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ లక్ష్మీనగర్ మురికివాడ ప్రాంతం అభివృద్ధికి అవసరమయే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్, వియంఆర్డిఏ కమిషనర్ ఎన్ తేజ్ భరత్, డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, జివిఎంసి అదనపు కమిషనర్ డివి రమణమూర్తి, ప్రధాన ఇంజనీర్ పి.వి సత్యనారాయణ రాజు, జోన్ 4 కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు, పర్యవేక్షక ఇంజనీర్ పల్లమరాజు పాల్గొన్నారు.

ఈస్ట్ కోస్ట్ రైల్వే జిఎం విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫుంక్వాల్ సోమవారం విశాఖపట్నంలోని వివిధ రైల్వే విభాగాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, భద్రతా ప్రమాణాలు, మౌలిక సదుపాయాల కల్పన, భవిష్యత్తు ప్రణాళికలపై ఆయన సమీక్ష జరిపారు. ఈ పర్యటనలో ఆయన వెంట వాల్తేరు డివిజన్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు. ముందుగా ముడసర్లోవలో నిర్మాణంలో ఉన్న దక్షిణ మధ్య తీర రైల్వే కొత్త జోనల్ కార్యాలయ భవనాన్ని జీఎం సందర్శించారు. ప్రాజెక్ట్ పురోగతి, డిజైన్ లక్ష్యాలు నిర్మాణ గడువులపై చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అంకుష్ గుప్తాతో చర్చించారు. అనంతరం ఆయన విశాఖలోని డీజిల్ లోకో షెడ్‌ను సందర్శించి, సీమెన్స్ లోకో టెక్నికల్ టీమ్స్‌తో చర్చించారు. లోకోమోటివ్ల నిర్వహణ, షెడ్ విస్తరణ పనులను సమీక్షించారు. మధ్యాహ్నం వడ్లపూడిలోని వ్యాగన్ వర్క్‌షాప్‌ను సందర్శించి, అక్కడ జరుగుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను, నిర్వహణ సామర్థ్యాన్ని పరిశీలించారు. విశాఖపట్నం రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ప్రయాణికుల కోసం నిర్మిస్తున్న నూతన వసతులను జీఎం పరిశీలించారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద డివిజన్ వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. పర్యటన ముగింపులో వాల్తేరు డివిజన్ నిర్వహించిన 4వ స్టేట్ క్యాంప్, ర్యాలీ ముగింపు వేడుకల్లో పరమేశ్వర్ ఫుంక్వాల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

నేడు జెడ్‌పి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : ఉమ్మడి విశాఖ జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 30న ఉదయం 10.30 గంటలకు ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో జరగనుందని జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి పి.నారాయణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని విభాగాల అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా పాదేశిక నియోజకవర్గ సభ్యులు, ఎంపిపిలు, అధికారులు సమావేశాలకు హాజరుకావాలని కోరారు.

బంద్‌పై ఉక్కుపాదం

పోలీసులతో నాయకులు, మహిళల వాగ్వివాదం

లేదంటూ లోకనాథంతో పాటు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గంటా శ్రీరామ్, ఆర్ శంకరరావు, మండల కార్యదర్శి ఎం.రాజేష్, పలువురు నాయకులు అరెస్టు చేసి వ్యాన్‌లో ఎస్ రాయవరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్.రాయవరం మండలం అడ్డరోడ్డులో రేవుపోలవరం రోడ్డు నుండి సిపిఎం నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టారు. సిపిఎం శ్రేణులను, సాధారణ ప్రజలను తీవ్రమైన నిర్బంధాన్ని ప్రయోగించి అక్రమ అరెస్టులకు పూనుకున్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, నాయకులు డి.వెంకన్న, జి.సత్యనారాయణ, గంట శ్రీరామ్, వివి శ్రీనివాస్, ఆర్ రాము, యమ్ సత్యనారాయణ, జి దేముడు నాయుడు, డిడి.వరలక్ష్మి, పి.మాణిక్యం, ఇతర నాయకులను అరెస్టు చేసి ఎస్.రాయవరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ప్రజలకు, వ్యాపారులకు బెదిరింపులు

సోమవారం తెల్లవారుజాము నుంచి పోలీసులు బంద్‌ను విఫలం చేయడానికి తీవ్రమైన ప్రయత్నాలు చేశారు. అప్పలరాజు స్వగ్రామం ధర్మవరంలో ఎవర్నీ బయటకు రాకుండా పోలీసులు భయభ్రాంతులకు గురి చేశారు. బంద్ చేపట్టనీయకుండా సెక్షన్ 30 అమలులో ఉందని పోలీసులు బెదిరింపు చర్యలకు పాల్పడ్డారు. రాజయ్యపేట గ్రామంలో మత్స్యకారులు బంద్‌లో పాల్గొనకుండా ముందస్తుగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. సిఐలు మురళి, అప్పన్నలు గ్రామానికి వెళ్లి సిపిఎం మండల కార్యవర్గ సభ్యులు మైలపల్లి మహేష్, కాశీరావు, చేపల సోమేశ్‌లను గృహ నిర్బంధం చేశారు. వారు నక్కపల్లి రాకుండా అడ్డుకున్నారు. చుట్టు పక్కల గ్రామాల్లో పోలీస్ పహారా ఏర్పాటు చేశారు. బంద్‌కు ఎవరూ సహకరించొద్దని ప్రతి షాప్‌కు పోలీసులు తిరిగి షాపులు తెరవాలని యజమానులను బెదిరించారు. విద్యాసంస్థలు నడపాలని డీఈవో, ఎంఈఓలు పెట్టి ఒత్తిడి చేశారు. వివిధ గ్రామాల నుంచి బందులో పాల్గొనడం కోసం వస్తున్న మహిళలు సైతం ఎక్కడికక్కడ అరెస్టులు చేశారు. సిపిఎం కార్యాలయం వద్ద ఎర్రజెండాలను కూడా పోలీసులు స్టేషన్‌కు తీసుకువెళ్లిపోయారు.

ప్రభుత్వ, పోలీసు చర్యలు దుర్మార్గం : లోకనాథం

శాంతియుతంగా బంద్ చేపడుతుంటే, దానిని పోలీసులు విచ్ఛిన్నం చేయడం పచ్చి దుర్మార్గమైన చర్యని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె లోకనాథం అన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా బందులో పాల్గొంటే పోలీసులు అడ్డుకున్నారని, తాము ఏమైనా ఉగ్రవాదులుమా అని ప్రశ్నించారు. అప్పలరాజు చట్టానికి లోబడే ప్రజల తరఫున నిలబడి అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. ప్రజాస్వామ్యంలో బంద్ అనేది ఒక ప్రక్రియని, హోం మంత్రి అనిత పోలీసుల ద్వారా విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నించడం పచ్చి దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం లేదని అనిత పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారని, నేడు ప్రజాస్వామ్యం ఉందా? అని ప్రశ్నించారు. రైతు సమస్యలపై గతంలో అప్పలరాజుతో కలిసి అనిత పోరాటం చేశారని, నేడు అధికారంలోకి రాగానే అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. హోంమంత్రి నియోజకవర్గంలో ప్రజల పక్షాన నిలబడి, చట్టబద్ధంగా పోరాటం చేస్తున్న అప్పలరాజుపై పీడీ యాక్ట్ పెట్టడం ఎంతవరకు సమంజసమని, ఇప్పటికైనా పునరాలోచన చేసి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే అప్పలరాజును బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పోలీసు స్టేషన్‌లో నేతలను పరామర్శిస్తున్న రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

పోలీసు స్టేషన్‌లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పరామర్శ

బంద్ సందర్భంగా అరెస్టు కాబడి ఎస్.రాయవరం పోలీసు స్టేషన్‌లో ఉన్న సిపిఎం నాయకులను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పరామర్శించారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ అప్పలరాజు అరెస్టును నిరసిస్తూ నక్కపల్లి, ఎస్ రాయవరం మండలాల్లో అఖిలపక్ష ప్రజావేదిక ఇచ్చిన పిలుపుమేరకు బందుకు ప్రజల మద్దతు లభించిందని, దానిని తట్టుకోలేని కూటమి ప్రభుత్వ నాయకులు పోలీసులతో తమ నాయకులను తీవ్రనిర్బంధంతో అక్రమంగా అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇలాంటి నిర్బంధాలతో అణిచివేతలతో ఉద్యమాలను ఆపలేరని స్పష్టం చేశారు.

నక్కపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాజయ్యపేటలో సిపిఎం నేత మహేష్ గృహ నిర్బంధం

ఆద్యంతం ఉత్సాహం.. ఉత్తేజం

ముఖ్య అతిథిగా కవి, సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ హాజరై అభ్యుదయ, విప్లవకర సినిమా పాటలు, అవి ఏ పరిస్థితులను బట్టి శ్రామిక గీతాలకు ప్రాధాన్యం ఇచ్చారన్న అంశాలను కళ్లకు కట్టినట్లు చెప్పడంతో సభికులంతా ఉత్సాహం, కరతాళ ధ్వనులతో ప్రతిస్పందించారు. శ్రామిక సంస్కృతిపై కార్పొరేట్ల దాడి నానాటికీ పెరుగుతోందని, 'రాజకీయ రౌడీ'లపై తాను నిరంతర రచనలు సాగిస్తూ ఉంటానని అన్నారు. అనేక సినీ అభ్యుదయ, విప్లవ గీతాలను అలవోకగా సభా వేదికపై ఆలపిస్తూ పాటలకు అర్థాన్ని చెబుతూ వినోదంతో పాటు విజ్ఞానం అందించడంతో సభికులంతా చప్పట్ల వర్షం కురిపించారు. మళ్లీ మళ్లీ శ్రమజీవుల సభలకు తాను వస్తూ ఉంటానని, ప్రతి ఏటా ఇలాంటి ఉత్సవాలు జరపాల్సిన అవసరం ఉందని అశోక్ తేజ వెల్లడించారు. సభకు ముందు అశోక్ తేజ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లోగల బుక్‌స్టాల్స్ అన్నీ కలియతిరిగారు. సభికులందరినీ ఏకరీతిన ఆనందోత్సాహంలో ముంచెత్తుతూ మరో విశిష్ట అతిథి జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ పుస్తక మహోత్సవ స్టాల్స్‌ను స్వయంగా సందర్శించారు. పలు పుస్తకాలను గురించి సమాచారం నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. విశాఖ వంటి చోట్ల పుస్తక పఠన సంస్కృతిని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు ఎస్ఆర్ శంకరన్ పుస్తకాన్ని కమిషనర్ స్వయంగా కొనుగోలు చేశారు. సైన్స్ ఎగ్జిబిషన్, ఫొటో ఎగ్జిబిషన్, షార్ట్ ఫిల్మ్ ప్రదర్శనలూ ఎంతగానో ఆకట్టుకున్నాయి. పుస్తక ప్రదర్శనకు పుస్తక ప్రియులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

1 నుండి 10 జోన్లగా జివిఎంసి కార్యకలాపాలు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ పరిధిలో 2026 జనవరి 1వ తేదీ నుండి పునర్వ్యవస్థీకరించిన 10 జోనల్ కార్యాలయాలను కార్యాచరణ ప్రారంభించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ జోనల్ కమిషనర్లను జీవీఎంసీ ప్రధాన కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోమవారం ఆదేశించారు. జివిఎంసి పరిధిలో ఉన్న జోనల్ పునర్వ్యవస్థీకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేసిందని దానికి అనుగుణంగా ప్రస్తుతం ఉన్న ఎనిమిది జోన్లను 10 జోన్లుగా ఏర్పాటు చేయడం జరిగిందని, అందుకు సంబంధించి జోనల్ కార్యాలయాలు, అధికారులు, సిబ్బందిని ఏర్పాటు చేశామని తెలిపారు. ఇకపై సిబ్బంది, అధికారులు ఆయా జోనల్ కార్యాలయాల నుండి విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్లను ఆదేశించారు. ఆయా జోనల్ కార్యాలయం పరిధిలో ఉన్న వార్డులు, సచివాలయాలు ప్రజలకు తెలిసే విధంగా సచివాలయాల వారీగా వార్డు కార్యదర్శులు అవగాహన కల్పించాలని జోనల్ కమిషనర్లను, అధికారులను కమిషనర్ ఆదేశించారు.

జివిఎంసి కొత్త జోన్ల వివరాలు

భీమునిపట్నం జోన్ : 1, 2, 3, 4 వార్డులు, మధురవాడ జోన్ : 5, 6, 7, 8, 98 వార్డులు, ఈస్ట్ జోన్ : 9, 10, 11, 12, 13, 15, 16, 17, 18, 19, 20, 21, 22, 23, 28 వార్డులు, నార్త్ జోన్ : 14, 24, 25, 26, 42, 43, 44, 45, 46, 47, 48, 49, 50, 51, 53, 54, 55 వార్డులు, సౌత్ జోన్ : 27, 29, 30, 31, 32, 33, 34, 35, 36, 37, 38, 39, 41 వార్డులు, వెస్ట్ జోన్ : 40, 52, 56, 57, 58, 59, 60, 61, 62, 63, 89, 90, 91, 92 వార్డులు, పెందుర్తి జోన్ : 88, 93, 94, 95, 96, 97 వార్డులు, గాజువాక జోన్ : 64, 65, 66, 67, 68, 69, 70, 71, 72, 73, 74, 75, 76, 86, 87 వార్డులు, అగనంపూడి జోన్ : 77, 78, 79, 85 వార్డులు, అనకాపల్లి జోన్ 80, 81, 82, 83, 84 వార్డులుగా విభజించడం జరిగిందని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఇకపై జీవీఎంసీ కల్పిస్తున్న సంక్షేమ పథకాలు మౌలిక సదుపాయాలు, సేవలు ఆయా జోనల్ కార్యాలయాల ద్వారా పొందవచ్చునని పేర్కొన్నారు.

రోలర్ స్కేటింగ్‌లో భవ్యశ్రీకి గోల్డ్ మెడల్

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : ఆంధ్రా వైద్య కళాశాలకు చెందిన 2023 బ్యాచ్ వైద్య విద్యార్థి వి.భవ్యశ్రీ విశాఖపట్నంలో జరిగిన 63వ నేషనల్ రోలర్ స్కేటింగ్ అంతర రాష్ట్ర పోటీలలో వ్యక్తిగత విభాగంలో బంగారు పతకం, గ్రూప్ విభాగంలో కాంస్య పతకం సాధించింది. ఈ మేరకు సోమవారం ఆమెను వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎస్.ఎం సంధ్యా దేవి, వైస్ ప్రెసిడెంట్ స్పోర్ట్స్ డాక్టర్ ఆర్.సునీల్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.ఎస్.ఎన్ పాత్రుడు అభినందించారు.

సమస్యల పరిష్కారానికి రెవెన్యూ క్లినిక్

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : సుదీర్ఘకాలంగా నలుగుతున్న రెవెన్యూ సమస్యలకు వేగవంతమైన పరిష్కారం చూపడమే రెవెన్యూ క్లినిక్‌ల ప్రధాన ఉద్దేశమని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అన్నారు. జెసితో పాటు తను కూడా వీటిని పర్యవేక్షిస్తానని చెప్పారు. సోమవారం కలెక్టరేట్ మీటింగు హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించగా, విసి హాలులో రెవెన్యూ క్లినిక్ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, ఆర్డీవోలు, తహశీల్దార్లు అక్కడే అందుబాటులో ఉండి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అక్కడికక్కడే ఆన్‌లైన్‌లో చూసి సమస్య స్థితిగతులను చెప్పారు. కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన పిజిఆర్ఎస్‌లో జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై మాట్లాడిన కలెక్టర్ ప్రభుత్వ ఉద్దేశాలను, లక్ష్యాలను అర్థం చేసుకొని అధికారులు పని చేయాలని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా రెవెన్యూ క్లినిక్ కోసం కలెక్టరేట్ కింది భాగంగా ప్రత్యేక డెస్కు ఏర్పాటు చేయటంతో పాటు, దరఖాస్తులు నింపేందుకు సహాయకులను నియమించారు. ప్రజలను దగ్గరుండి విసి హాలులో నిర్వహించిన రెవెన్యూ క్లినిక్ వద్దకు తీసుకెళ్లారు. ప్రజలు అధికారుల ఎదురుగా కూర్చొని ఫిర్యాదు ఇవ్వడానికి, సమస్య చెప్పుకోడానికి వీలుగా కుర్చీలు వేయటంతో పాటు, ఇతర ఏర్పాట్లు చేశారు. పిజిఆర్ఎస్‌లో జివిఎంసి, పోలీస్, ఇతర శాఖలకు సంబంధించిన వివిధ సమస్యలపై ప్రజలు 262 వినతులు సమర్పించగా, విసి హాలులో నిర్వహించిన రెవెన్యూ క్లినిక్‌లో ప్రజలు 72 వినతులు సమర్పించారు.

నూతన సంవత్సర వేడుకల్లో నిబంధనలు పాటించాలి

హోటళ్లు, క్లబ్‌లు, పబ్‌లు, బార్ అండ్ రెస్టారెంట్లు, రిసార్ట్స్ నిర్వాహకులతో ఆనందపురం సిఐ

నిబంధనలను వివరిస్తున్న సిఐ వాసునాయుడు

ప్రజాశక్తి-ఆనందపురం: విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు నూతన సంవత్సరం వేడుకల నిర్వహణపై ఆనందపురం పోలీస్ స్టేషన్ సిఐ వాసునాయుడు సోమవారం హోటళ్లు, క్లబ్‌లు, పబ్‌లు, బార్ అండ్ రెస్టారెంట్లు, రిసార్ట్స్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. డిసెంబర్ 31, జనవరి 1వ తేదీ మధ్య నిర్వహించనున్న న్యూ ఇయర్ వేడుకలకు సంబంధించి పోలీస్ శాఖ జారీ చేసిన మార్గదర్శకాలను వివరించారు. కార్యక్రమాలు. ఈవెంట్లు నిర్వహించాలనుకునే వారు ముందుగా పోలీస్ కమిషనర్‌కు అనుమతి తీసుకోవాలని చెప్పారు. ఆ ప్రాంతాల్లో రికార్డింగ్ సౌకర్యం ఉన్న సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమాల వద్ద తగిన సంఖ్యలో సెక్యూరిటీ గార్డులను నియమించాలని, ఎక్కువ ద్వారాలు ఏర్పాటుచేయాలని చెప్పారు. వేడుకల్లో అశ్లీలతకు, న్యూడిటీకి అనుమతి లేదని స్పష్టం చేశారు. సంగీత శబ్ద స్థాయిలు 45 డెసిబెల్స్‌లోపే ఉండేలా చూడాలన్నారు. ఈవెంట్ ప్రాంగణంలోకి ఎలాంటి ఆయుధాలకు అనుమతి లేదని, నిబంధనలు ఉల్లంఘిస్తే నిర్వాహకులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలోని ప్రతి గ్రామంలో బ్లూ కోర్ట్ వాహనాలు, ఎఆర్ సిబ్బంది సహా పోలీస్ బృందాలతో నిరంతర తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్నా వెంటనే 7382296908 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ప్రజలను సిఐ వాసునాయుడు కోరారు.

నేరాలు ఘోరాలు

రిసార్ట్‌లో వ్యభిచారం

- ముగ్గురు విటులు అరెస్ట్

ప్రజాశక్తి- భీమునిపట్నం : స్థానిక బీచ్ రోడ్డు సమీపంలో ఉన్న ఓ రిసార్ట్‌లో వ్యభిచారం జరుగుతుందన్న సమాచారంతో స్థానిక పోలీసులు సోమవారం దాడులు చేశారు. ఈ దాడిలో ముగ్గురు విటులు, యువతి పట్టుబడ్డారు. పట్టుబడ్డ విటులను పోలీసులు అరెస్ట్ చేశారు. సిఐ బి.తిరుమలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని ముషిడిపల్లి సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగయ్యపేట శివారు సీతంపేటకు చెందిన జుంజూరు అర్జున్ (35) అనే యువకుడు మృతి చెందాడు. ఘటనకు సంధించి పోలీసులు, మృతుడి బంధువులు చెప్పిన వివరాలివి.ఆనందపురం సమీపంలోని ఓ రెస్టారెంటులో అర్జున్ చెప్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి ఎప్పటిలాగే పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా ముషిడిపల్లి జంక్షన్ దాటిన తరువాత బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కనున్న గొయ్యిలో పడిపోయాడు. అర్ధరాత్రి వరకు ఎవరూ గమనించకపోగా, తర్వాత అటుగా వచ్చిన కొంతమంది ప్రమాదానికి గురైన ద్విచక్ర వాహనాన్ని గమనించి, వాహనం నెంబరుతో ఆన్‌లైన్‌లో చెక్‌చేసి వచ్చి ఫోను నెంబర్‌కు ప్రమాదసమాచారం అందించారు. దీంతో కుటుంబసభ్యులు చేరుకుని అర్జునను కె.కోటపాడు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని తమ్ముడు అప్పారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. మృతుడు అర్జునకు గౌరీతో మూడేళ్ల క్రితం వివాహంకాగా, వారికి యశ్విన్ అనే రెండేళ్ల కొడుకు ఉన్నాడు. ఇంటి పెద్దదిక్కు మరణంతో భార్య, కొడుకు అనాథగా మారిపోయారు.

'ఆదర్శ్'లో నేడు జాబ్‌మేళా

ప్రజాశక్తి- పెందుర్తి : స్థానిక ఆదర్శ్ డిగ్రీ కాలేజీలో మంగళవారం 10 కంపెనీలు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ఎన్ఇ ఫ్లోరా తెలిపారు. మిరాకిల్ సాఫ్ట్ వేర్ సిస్టమ్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, వరుణ్ గ్రూప్, ఇనోవ్ సోర్స్, టాటా ఎలక్ట్రానిక్స్, అపోలో ఫార్మసీ ట్రైనీ, ఆరంజ్ హెల్త్ కేర్, గ్లాండ్ ఫార్మా లిమిటెడ్, డైకిన్, స్కైరూట్ కంపెనీ ప్రతినిధులు పాల్గొని ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. బిఎ, బికామ్, బిఎస్‌సి, బిసిఎ, బిబిఎ, డిప్లమో, ఇంటర్మీడియట్, పదో తరగతి, ఐటిఐ పూర్తయిన వారు, డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న వారూ మేళాకు హాజరుకావచ్చని తెలిపారు. ఎంపికైన వారు విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరులో పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రెజ్యూమ్, ఫొటోలతో మంగళవారం ఉదయం 9 గంటలకు హాజరుకావాలని కళాశాల సెక్రటరీ టి.థియోఫిలాస్ కోరారు.

భీమిలి జోన్ పిజిఆర్‌ఎస్‌కు అర్జీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వివిధ సమస్యలపై 5 అర్జీలు అందినట్లు జోనల్ కమిషనర్ నాగేంద్రకుమార్ తెలిపారు. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి 2, ఇంజినీరింగ్ విభాగానికి 3 అర్జీలు అందినట్లు పేర్కొన్నారు. వీటిని ఆయా విభాగాల అధికారులకు పంపించినట్లు తెలిపారు

గుడి నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 6వ వార్డు పరిధి రేవళ్లపాలెం గ్రామ దేవత బంగారమ్మ తల్లి, భూలోకమ్మ తల్లి ఆలయ నిర్మాణం కోసం విఘ్నేశ్వర సేవా సంఘం సభ్యులు రూ.1 లక్ష విరాళాన్ని అందించారు. రేవళ్లపాలెం బంగారమ్మ తల్లి భూలోకమ్మ తల్లి సంక్షేమ సేవా సంఘం, గ్రామ పెద్దల సమక్షంలో విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు పిల్ల రమణబాబు, సెక్రటరీ వాండ్రసి చిట్టిబాబు, ట్రెజరర్ నాగోతి లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

ఎఫ్‌ఎల్‌ఎన్ స్థాయిల పరిశీలన

ప్రజాశక్తి- ఆనందపురం : రాష్ట్ర విద్యాశాఖ అమలు చేస్తున్న గ్యారెంటెడ్ ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమంలో భాగంగా ఆనందపురం మండలంలోని ఎంపిపిఎస్ దుక్కవానిపాలెం, జిఎస్.అగ్రహారం, నేలతేరు పాఠశాలలను స్టేట్ అబ్జర్వర్ ఎస్ఇఆర్‌టి బృందం సందర్శించింది. ఈ సందర్భంగా విద్యార్థుల పఠన, గణిత నైపుణ్యాల ఎఫ్‌ఎల్‌ఎన్ స్థాయిలను పరిశీలించింది. బోధనా విధానాలు, పాఠ్య ప్రణాళికల అమలు తీరును పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా అసిస్టెంట్ ఎఎంఓ లక్ష్మి, సిఆర్‌ఎం ఉపాధ్యాయులు జి.శివాజీ, గౌరీశంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

జోన్ -1 కమిషనర్‌గా నాగేంద్ర కుమార్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కమిషనర్‌గా టి.నాగేంద్రకుమార్ సోమవారం జోనల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. నాగేంద్రకుమార్ రెండో జోన్ కార్యాలయంలో ఆర్ఒగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. గత కొంత కాలంగా ఇక్కడ జోనల్ కమిషనర్‌గా పనిచేసిన ఒమ్మి అయ్యప్పనాయుడు బదిలీపై జోన్-2 కు వెళ్లారు.

జోనల్ కమిషనర్‌కు అభినందనలు

జివిఎంసి 1వ జోన్ కమిషనర్‌గా సోమవారం బాధ్యతలు స్వీకరించిన నాగేంద్రకుమార్‌ను టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు తదితరులు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువా కప్పి, పుష్ప గుచ్ఛం అందజేసి అభినందించారు. మూడో వార్డు పరిధిలో అపరిష్కృతంగా ఉన్న పలు ప్రజా సమస్యలను ప్రాధాన్యత వారీగా పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ స్థానిక నాయకులు సిహెచ్.రమణ, కె.నాగరాజు, ఎం.సంజీవ్‌కుమార్, షేక్ అన్వర్, వి.పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

జోనల్ కమిషనర్‌ను కలిసిన నూకరాజు తదితరులు

రుషికొండ దేవస్థానంలో దివీస్ ఆర్ఒ ప్లాంటు

ఆర్ఒ ప్లాంటు ప్రారంభంలో దివీస్ ప్రతినిధులు

ప్రజాశక్తి -తగరపువలస : రుషికొండలోని తిరుమల తిరుపతి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం రెండు ఆర్ఒ ప్లాంట్ల యూనిట్లను దివీస్ లేబొరేటరీ యాజమాన్యం నెలకొల్పింది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులకు సుమారు రూ.29.30 లక్షల విలువైన జల ప్రసాదం యూనిట్లు అందించిన దివీస్ సంస్థకు భక్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దివీస్ జనరల్ మేనేజర్ వైఎస్.కోటేశ్వరరావు, సిఎస్ఆర్ ప్రతినిధి డి.సురేష్‌కుమార్, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలలే దేశ సంపద

ప్రజాశక్తి -ములగాడ : బాలలే దేశ సంపద అని, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి అన్నారు. 61వ వార్డు పరిధి ప్రకాష్ నగర్‌లో సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్-2 ఆధ్వర్యంలో ప్రకాష్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు వివిధ పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చిన్నారులు క్రమశిక్షణతో, దేశభక్తితో ఎదగాలని, వారి సర్వతో ముఖాభివృద్ధికి విద్యావంతులు కృషిచేయాలని పేర్కొన్నారు. అనంతరం 'ఎముకుల బలం'పై ప్రముఖ వైద్యులు డాక్టర్ యోగనాథ్ వివరించారు. వికసిత్ భారత్‌పై చర్చా కార్యక్రమం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో భాగంగా వెలగా వెంకటప్పయ్య పంతులు జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్కాపురం గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అనసూయాదేవి

దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవం ప్రారంభం

ప్రజాశక్తి-మధురవాడ : చంద్రంపాలెం జాతర గట్టు శ్రీ దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ క్షేత్ర పాలకునిగా ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామి సుప్రభాత సేవతో ఉత్సవం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆలయంలో పలు సాంస్కృతిక కార్యకర్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, ఆలయ కమిటీ అధ్యక్షులు పిళ్లా సూరిబాబు, చంద్రంపాలెం గ్రామ పెద్దలు పిళ్లా శ్రీనివాసరావు, పీస రామారావు, జగుపిల్లి నాని, పిళ్లా సత్యనారాయణ, ఆలయ కమిటీ సెక్రటరీ నాగోతి తాతారావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు

రోగిని పరీక్షిస్తున్న వైద్యులు

95 మందికి హోమియో వైద్య సేవలు

ప్రజాశక్తి- భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ కార్యాలయం వద్ద సోమవారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్యులు టి.జగన్నాథరావు, టిజె.మోహన్ 95 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. తొలుత ఈ వైద్య శిబిరాన్ని ఫౌండేషన్ చైర్మన్ కె.శ్రీరామచంద్రమూర్తి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు కెఎస్ఎన్.మూర్తి, కె.చంద్రశేఖర్, కెవి.భానోజీరావు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానం కోసం స్థల పరిశీలన చేస్తున్న రెవెన్యూ అధికారులు, నాయకులు

శ్మశానానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి-కొమ్మాది : జివిఎంసి 6వ వార్డు పరిధిలోని కె1, కె2, కె3, జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం కాలనీలకు సంబంధించి శ్మశానవాటిక స్థలం కోసం రెవెన్యూ అధికారులు సోమవారం పరిశీలించారు. కాలనీలకు శ్మశాన వాటిక లేక స్థానికులు పడుతున్న ఇబ్బందులను వార్డు టిడిపి ప్రధాన కార్యదర్శి లొడగల జానకిరామ్ కాలనీ నాయకులతో కలిసి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, యువ నాయకులు గంటా రవితేజ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి ఆదేశాలివ్వడంతో సోమవారం రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు క్షేత్రస్థాయిలో పర్యటించారు. పలు అనువైన స్థలాలను పరిశీలించారు. రెవెన్యూ రికార్డులను సరిచూసి, నివేదిక అందజేస్తామని అధికారులు తెలిపారు.

'విశాఖ'లో ముగిసిన త్రీడీ ప్రింటింగ్ వర్క్‌షాప్

51వ వార్డు నాయకులను అభినందిస్తున్న ఎంపీ శ్రీభరత్

టిడిపి కార్యకర్తలకు అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి -మాధవధార : సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వ ప్రతిష్టకు జీవం పోసిన టిడిపి కార్యకర్తలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు మేరకు రామ్‌నగర్‌లో ఉన్న పార్టీ జిల్లా కార్యాలయంలో అవార్డులు ప్రదానం చేశారు. కార్యకర్తలకు అవార్డులను విశాఖ ఎంపీ శ్రీభరత్, గండి బాబ్జీ, పార్టీ జిల్లా అధ్యక్షులు పట్టాభి, సెక్రటరీ లోడగల కృష్ణ అందించారు. 51వ వార్డుకు చెందిన కూన మోహన్‌రావు, కూన సతీష్ కుమార్, ముత్యాల పాత్రుడు, సత్యం అవార్డులు అందుకున్నారు. వీరికి వార్డు టిడిపి అధ్యక్షులు సనపల కీర్తి అభినందించారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి -ములగాడ : స్థానిక జవహర్‌నగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్-1 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా సోమవారం కంటి వైద్య శిబిరాన్ని ప్రముఖ వైద్యులు డాక్టర్ భాగ్యరాజ్ ప్రారంభించారు. ఈ శిబిరంలో 150 మంది ఉచితంగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. 13 మంది ఉచిత ఆపరేషన్లకు ఎంపిక అయ్యారు. ప్రోగ్రాం అధికారి సంధ్యారాణి ఆధ్వర్యాన జరిగిన శిబిరంలో 50 మంది వాలంటీర్లు సేవలను అందించారు. కార్యక్రమంలో మెడికవర్ వైద్య సిబ్బంది డాక్టర్ రాజు, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్ -2 ఆధ్వర్యంలో ఇందిరా కాలనీలో నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరంలో స్థానికులకు వృత్తి విద్యా శిక్షణను వాలంటీర్లు అందజేశారు. అనంతరం సామాజిక సమస్యలపై సర్వేను కొనసాగించారు. యూనిట్ 2 కార్యక్రమాలను నదియా పర్యవేక్షించారు.

చరణ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యేలు

వాలీబాల్ క్రీడాకారుడు చరణ్‌కు అభినందనలు

ప్రజాశక్తి గాజువాక : చైనా వేదికగా ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు జరిగిన ఇంటర్నేషనల్ స్కూల్ ఛాంపియన్‌షిప్ అండర్ 15 వాలీబాల్ పోటీలో ఇండియా తరపున టీమ్ కెప్టెన్‌గా ప్రాతినిధ్యం వహించి తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించిన చరణ్‌కు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు అభినందనలు తెలిపారు. వైజాగ్ సాయి అకాడమీలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో గణబాబు మాట్లాడుతూ, జట్టు విజయంలో చరణ్ కీలక భూమిక పోషించారని తెలిపారు. చరణ్ ప్రతిభను జట్టు యాజమాన్యం, ఇండియన్ వాలీబాల్ ఫెడరేషన్, ఆంధ్ర వాలీబాల్ సంఘం, సాయి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రశంసించాయి.

చరణ్ చిన్నప్పటి నుంచి మేనమామల ఇంట్లో పెరిగి, విద్యాభ్యాసం ఉక్కు నగరం డివిఎవి స్కూల్లో చదివారు. స్కూల్ తరపున వాలీబాల్ ఆటలో పాల్గొని ఎన్నో పతకాలు సాధించారు. స్కూల్ పిటి మల్లేశ్వరరావు ప్రోత్సాహంతో సాయి అకాడమీ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా)కి సెలెక్ట్ అయి సీటు సాధించి కోచ్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆటలో మెలకువలు నేర్చుకొని ఇండియా తరపున ఇంటర్నేషనల్ లెవెల్‌లో వాలీబాల్ ఆడి పతకాలను సాధించాడు. ఈ కార్యక్రమంలో విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, నూరిబాబు, మోహన్‌బాబు, మేనమామలు డి.రవి, డి.దానప్పలు, దీపిక, క్రాంతి, దేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- వేపగుంట : విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో మెకానికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విద్యార్థులకు నిర్వహించిన నాలుగు రోజుల 'త్రీడీ ప్రింటింగ్' వర్క్‌షాప్ సోమవారంతో ముగిసింది. రిసోర్స్ పర్సన్‌గా ఒడిశాలోని భవానిపట్నం సిటిటిసికి చెందిన సబీర్ సింగ్ హాజరై విద్యార్థులకు త్రీడీ ప్రింటింగ్‌పై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. వస్తువులను ప్రాక్టికల్‌గా ఏ విధంగా రూపొందించాలో మెలకువలు నేర్పించారు. ముఖ్యంగా 'ఫ్రీకాడ్' సాఫ్ట్‌వేర్‌ను ఎలా ఉపయోగించాలి, ప్రస్తుత తరుణంలో వివిధ కంపెనీలలో త్రీడీ ప్రింటింగ్ ప్రాముఖ్యత ఎంత ఉందనే విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వర్క్‌షాప్ ముగింపు సందర్భంగా రిసోర్స్ పర్సన్ సబీర్ సింగ్‌ను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.వి.ప్రదీప్‌వర్మ, డీన్ అకడమిక్స్, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ డి.శాంతారావు, వైస్ ప్రిన్సిపల్, ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ బి.జీవనరావు సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. మెకానికల్ కో-ఆర్డినేటర్ చిట్టిబోయిన కిరణ్‌కుమార్, ఇసిఇ కో-ఆర్డినేటర్ డాక్టర్ కౌసర్ జహార్ పర్యవేక్షణలో జరిగిన వర్క్‌షాప్‌లో వివిధ విభాగాల అధిపతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

రిసోర్స్‌పర్సన్ సబీర్‌సింగ్‌ను సత్కరిస్తున్న విశాఖ ఇంజినీరింగ్ కళాశాల ప్రతినిధులు

డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 71వ వార్డు పరిధి సుందరయ్యకాలనీ, దత్తసాయినగర్‌లో సుమారు రూ.3.30 కోట్లతో చేపట్టనున్న డ్రెయినేజీ పనులకు కార్పొరేటర్ రాజాన రామారావుతో కలిసి ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల అవసరాలకనుగుణంగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గాజువాక నియోజకవర్గ పరిధిలో రూ.223 కోట్ల విలువైన పనులకు శ్రీకారం చుట్టామని చెప్పారు. డ్రెయినేజీ వ్యవస్థను పూర్తిగా ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు, నాయకులు వెన్నెల ఈశ్వరరావు, పప్పు రాజారావు, కరణం కనకారావు, పప్పు శంకరరావు, రొంగలి లక్ష్మీనాయుడు, వార్డు అధ్యక్షుడు బొడ్డేడ నాయుడు, కార్యదర్శి చంద్రరావు, నక్కా రాజారావు, క్లస్టర్ ఇన్‌ఛార్జి శ్రీనివాసరావు, రమణ, శంకరమ్మ, కుంచుమాంబ కాలనీ అధ్యక్షుడు మోహన్, జోనల్ కమిషనర్ శేషాద్రి, డిఇ అప్పారావు, ఎఇ, వర్క్ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇపిఎస్ భాగ్యలక్ష్మి

యువతకు సమస్యలను పరిష్కరించే శక్తి అవసరం

ప్రజాశక్తి -ములగాడ : యువత సామాజిక సమస్యలను అర్థం చేసుకుని, వాటిని పరిష్కరించే శక్తిని సమకూర్చుకోవాలని ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి సూచించారు. 61వ వార్డు పరిధి పల్లివీధిలో సెయింట్ ఆన్స్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ -1 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరంలో సామాజిక సర్వే రిపోర్ట్‌పై ఆమె మాట్లాడారు. ప్రజల అవసరాలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం నాయకత్వంలో ముఖ్యమైన అంశమన్నారు. శిబిరంలో భాగంగా 550 కుటుంబాలను వాలంటీర్లు సర్వే చేసి, నివేదికను తయారు చేశారు. సర్వేలో భాగంగా అనేకమంది సొంత గృహాలు కేటాయించాలని, పారిశుధ్య పరిస్థితిని మెరుగుపరచాలని కోరారు. మధ్యాహ్న కార్యక్రమాలలో భాగంగా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై వ్యాసరచన పోటీని వాలంటీర్లకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు దేవిక, గీతిక, విశ్వజా, శిరీష, చర్మిల పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన

ప్రజాశక్తి-సీతమ్మధార : అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో సోమవారం అవయవ దానంపై వాకర్స్‌కు అవగాహన సదస్సు నిర్వహించారు. సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సుకు ట్రస్ట్ చైర్ పర్సన్ డాక్టర్ గూడూరు సీతామహలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరై అవయవ దానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎవరైనా బ్రెయిన్‌డెడ్ అయితే వారి అవయవాలు దానం చేయడం ద్వారా మరికొందరు పునర్జీవులు అవుతారని తెలిపారు. మరణించిన వారు నేత్రదానం చేయడం ద్వారా మరొకరికి ఈ ప్రపంచాన్ని చూసే భాగ్యం కలుగుతుందన్నారు. శరీర దానంతో వైద్య విద్యార్థుల జ్ఞానసముపార్జనకు సహకరించినట్లు అవుతుందని తెలిపారు. అవయవదాన అంగీకారం ఆన్‌లైన్ ద్వారా ఎవరికి వారే రిజిస్టర్ చేసుకునే సదుపాయం ఉందని, వారికి ప్రభుత్వమే సర్టిఫికెట్ మంజూరు చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ప్రజాశక్తి- యంత్రాంగం

ప్రజాశక్తి 2026 కేలండర్లను సోమవారం పలుచోట్ల ఆవిష్కరించారు.

భీమునిపట్నం : ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఎంవిపి.కాలనీలో ఉన్న ఆతని నివాసంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి భీమిలి, ఆనందపురం, తగరపువలస విలేకర్లు, డివిజన్ ఆర్గనైజర్ కె.వెంకటరమణ పాల్గొన్నారు.

ఆనందపురం : ప్రజాశక్తి కేలండర్‌ను ఆనందపురం మండలంలోని వైసిపి కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మజ్జి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాశక్తి పత్రిక ప్రజల సమస్యలను నిరంతరం వెలుగులోకి తెస్తుందని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆనందపురం, తగరపువలస, పద్మనాభం మండలాల విలేకర్లు దొంతల చిన్న శ్రీను, వెంపాడ రాజారావు, కంటుబుక్త సత్యనారాయణ, జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ : జివిఎంసి 12వ వార్డు టిడిపి కార్యాలయంలో ప్రజాశక్తి నూతన సంవత్సర కేలండర్‌ను 13వ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీత సత్యనారాయణతో కలిసి టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, మాజీ కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడి, ప్రతి అక్షరం ప్రజల పక్షం ఉండేలా రాసే దినపత్రిక ప్రజాశక్తి అని కొనియాడారు. పత్రికా ధర్మాన్ని పాటిస్తూ నీతి, నిజాయతీతో పత్రిక పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు టిడిపి అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు, ఒమ్మి అప్పలరాజు, ముగడ రాజారావు, వార్డు ఇన్‌ఛార్జిలు మద్దిల రాజశేఖర్, గాడి సత్యం, తురకపూడి బాలస్వామి, మూది అప్పారావు, కాకి గంగరాజు, నాయకులు కొత్తల గోపాల్, వడిసెల శ్రీనివాస్, ఆదినారాయణ రాజు, సిపిఎం నాయకులు పి.శంకర్, వి.నరేంద్రకుమార్, ప్రజాశక్తి డివిజన్ ఆర్గనైజర్ ఆర్.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం వైసిపి కార్యాలయంలో కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న మజ్జి శ్రీనివాసరావు

రాజ్యమేలుతున్న

మనువాదం.. మార్కెట్‌వాదం

- భావ వ్యక్తీకరణపై దాడి
- మానవతా సందేశాలతో జాతీయ స్ఫూర్తికి పునరంకితం కావాలి
- 'శ్రామిక ఉత్సవ్'తో నవ్యాంధ్రకు నవ్య సందేశం విశాఖ నుంచే..
- ప్రముఖ కవి, రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'దేశభక్తి వేరు.. ద్వేష భక్తి వేరు. ద్వేషంతో భారతదేశ సంస్కృతి, వారసత్వం నిలబడదు. నేడు 'పబ్లిక్ స్పేస్ (జనం పరిధి) హరించుకుపోయి కార్పొరేట్ స్పేస్ (పెట్టుబడిదారుల పెత్తనం) ఆక్రమిస్తోంది. ప్రతిదీ మానిటైజేషన్, ప్రైవేటైజేషన్ అంటున్నారే తప్ప హ్యూమనైజేషన్ (మానవీయత)కు ప్రాధాన్యమివ్వడం లేదు. మనువాదం.. మార్కెట్‌వాదం నేడు రాజ్యమేలుతున్నాయి. లేబర్ కోడ్‌లు, నిర్బంధ చట్టాలు శ్రమజీవులపై విసిరే కేంద్ర విధానాలపై ప్రజా తిరుగుబాటు జరిగితే తప్ప పాలకుల తీరులో మార్పు రాదు' అని ప్రముఖ కవి, రచయిత, రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి అన్నారు. విశాఖ నగరంలో ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకూ జరిగే సిఐటియు 18వ అఖిల భారత మహాసభకు సన్నద్ధంగా ఈ నెల 27 నుంచి తలపెట్టిన 'శ్రామిక్ ఉత్సవ్' కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన రవి 'ప్రజాశక్తి' విశాఖ బ్యూరోచీఫ్ ఎన్.మధుతో తన భావాలను పంచుకున్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్.. పిపిపిపి పదాలే తప్ప ఈజ్ ఆఫ్ పీపుల్ లివింగ్.. ఈజ్ ఆఫ్ వర్కింగ్ అనే మాటలు ఎక్కడా కానరావడం లేదంటూ తన రాజకీయ బాణాలను సంధించారు. ఒక్కమాటలో చెప్పాలంటే నవ్యాంధ్రప్రదేశ్‌కు నవ్య సందేశాన్ని విశాఖపట్నం నుంచి ఇచ్చేందుకే 'శ్రామిక ఉత్సవ్' ద్వారా రంగం సిద్ధమైందన్నారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ పరిణామాల గురించి వివరించారు. ఆ విషయాలు ఆయన మాటల్లోనే...

భావ వ్యక్తీకరణ, మీడియా స్వేచ్ఛకు సంకెళ్లు.. దాడులు

జాతీయ స్థాయిలో భావ ప్రకటనా స్వేచ్ఛ అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఏలిన వారిని పొగిడినంతవరకే మీడియాకు స్వేచ్ఛ తప్ప విమర్శించే హక్కు లేకుండా పోయింది. ఇది కేవలం మీడియాకు మాత్రమే కాదు. సోషల్ మీడియాపైనా, కవిత్వం, సాహిత్యం, రచనలు, అభ్యుదయ సినిమాలపైనా ఈ దాడులు జరుగుతున్నాయి. కొన్ని సినిమాలైతే విడుదల కాకముందే దాడులకు గురౌతున్నాయి. సమాజంలో సగభాగమైనటువంటి మహిళలపై దారుణమైనటువంటి భాషలో విమర్శలు గుప్పించడం చూస్తున్నాం. పత్రికలు సంపాదకీయాలు రాసినా, ప్రధాన రాజకీయ పార్టీలు చెప్పినా.. మేం మాట్లాడింది సరైనదంటూ మనుషుల పట్ల గౌరవం తగ్గే విధంగా 'మనువాద భావజాలం రాజ్యమేలుతోంది'. మనువాద భావజాలం, మనువాద మార్కెట్ మధ్య ప్రజానీకం, శ్రామికవర్గం, మహిళలు నలిగిపోతున్నటువంటి నేటి పరిస్థితుల్లో మానవతా సందేశం ఇచ్చి మరోసారి జాతీయ స్ఫూర్తికి పునరంకితం కావాల్సి ఉంది. దేశ భక్తి వేరు.. ద్వేష భక్తి వేరు.. ద్వేషంతో దేశం ఎప్పుడూ నిలబడదు. భిన్నమతాలు, భిన్న సంస్కృతులు.. వీటన్నిటికీ నిలయమైన ఈ విశాల భారతదేశంలో మానవతా సందేశాలతో ప్రజలంతా కలిసి ముందుకు వెళ్లాలని నాడే గురజాడ, శ్రీశ్రీ పేర్కొన్నారు. ఆ దిశగా అంతా ముందుకు సాగాలి.



విశాఖపట్నం కేంద్ర బిందువు

రాజకీయాల్లో విశాఖపట్నం కేంద్ర బిందువుగా మారింది. తొలి నుంచీ ఉత్తరాంధ్ర సాహిత్య, సాంస్కృతిక పునర్వికాసంలో అగ్రభాగాన నిలబడి ఉంది. తెలుగు భాషను కాపాడటంలో, చైతన్యాన్ని నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించింది. ప్రకృతి సంపదలకే ఉత్తరాంధ్ర నిలయం. గురజాడ అప్పారావు, శ్రీశ్రీ ఇదే గడ్డపై పుట్టి ప్రజలు, శ్రమ జీవుల తరఫున కవిత్వం ఝుళిపించారు. మహాప్రస్థానం ఒక దేశభక్తి సముదాయం. నేడు జనగళం, సాహితీ స్రవంతి వంటి సంస్థలు శ్రామిక ఉత్సవాలను ప్రజా సంస్కృతిని పెంపొందించడానికి చేపడుతున్నాయి. దేశమంటే మనుషులోయ్ అని, సొంతలాభం కొంత మానుకొని పొరుగువాడికి తోడ్పడాలని గురజాడ చెప్పారు తప్ప విశాఖ ఉక్కును, కొండలను, భూములను ప్రైవేట్ మార్కెట్‌లో అమ్మకానికి పెట్టాలని ప్రభుత్వాలకు ఎవ్వరూ చెప్పలేదు. దేశంలో ప్రభుత్వాలు మారుతున్నా ప్రజల స్పేస్‌ను కబ్జా చేసే విధానాలు మారడం లేదు. అందుకే ఉద్యమాలను నిలబెట్టే విశాఖ ఉత్సవ్ వంటి కార్యక్రమం ఇక్కడ చేపడుతుండడం గొప్ప విషయం.

ఆకట్టుకుంటూ... ఆలోచింపజేస్తూ

కొనసాగుతున్న సైన్స్ ఎగ్జిబిషన్
అధిక సంఖ్యలో తరలివస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

సిఐటియు 18వ అఖిలభారత మహాసభల సందర్భంగా ఎయు కన్వెన్షన్ హాల్ వెనుకగల ఎగ్జిబిషన్ మైదానంలో ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ సైన్స్‌తోనే మానవ మనుగడ అంటూ ప్రజలను ఆకట్టుకుంటూ, ఆలోచింపజేస్తూ ఆదరణ చూరగొంటోంది. ఈ నెల 27న ప్రారంభించిన ఈ ఎగ్జిబిషన్‌కు ప్రతిరోజూ నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పలు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు పెద్దఎత్తున తరలి వచ్చి తిలకిస్తున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన వివిధ సైన్స్ అంశాలు వారిని ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. సైన్స్ లేనిదే సమాజం ప్రగతి లేదు. మానవుడు తన చుట్టూ ఉన్న భౌతిక జీవ వాతావరణ నిశితంగా పరిశీలించడం, పరిశీలించిన అంశాల మధ్య అర్థవంతమైన సంబంధాలను ఏర్పరచడం ద్వారా, ఈ ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి కావాల్సిన భావనలను రూపొందించుకున్నాడు. ఈ మానవ ప్రయత్నమే విజ్ఞాన శాస్త్రానికి దారితీసింది. ప్రకృతిలోని రహస్యాలు తెలుసుకోవడం కోసం ఎందరో శాస్త్రజ్ఞులు నిర్విరామంగా కృషి చేసి మనకు ఈ విజ్ఞాన శాస్త్రాన్ని అందించిన సంగతి తెలిసిందే. సాంఘిక, ఆర్థిక, పారిశ్రామిక, వ్యవసాయ, ఆరోగ్య, రవాణా రంగాలన్నింటిలో ప్రతిభావంతమైన మార్పులు శాస్త్రీయ విజ్ఞాన అభివృద్ధి ద్వారా జరుగుతున్నవే. సైన్స్ సాధించిన అనేక విజయాల గురించి చెప్పాలంటే, కంప్యూటర్, పొలిటికల్ సైన్స్, బిఎస్‌సి కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్‌తో పాటు, అంతరిక్షంలోకి మానవుడు ప్రవేశించే సైన్స్ గురించి చెప్పుకోక తప్పదు.

మత ఛాందస భావాలను చిన్నతనం నుంచి ప్రేరేపించి, తద్వారా లబ్ది పొందాలని ఆశిస్తున్న రాజకీయ నాయకుల కుళ్లు, కుతంత్రాలు వాస్తవం కాదని, సైన్స్ ద్వారానే మానవ మనుగడ సాధ్యమవుతుందని రుజువు చేసేలా ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో వివిధ విద్యాసంస్థల నుంచి విద్యార్థులు ఏర్పాటు చేసిన అంశాలను చూస్తే మనకు తెలుస్తోంది. కంచరపాలెం, పెందుర్తి పాలిటెక్నిక్ కాలేజీల విద్యార్థులతో పాటు తగరపువలస ఎన్ఆర్ఐ, గాయత్రి విద్యా పరిషత్ (జివిపి) మెడికల్ కాలేజీల విద్యార్థులు వివిధ అంశాలపై సైన్సు ప్రాజెక్టులను ఏర్పాటు చేశారు. ఇదే సందర్భంగా జనవిజ్ఞాన వేదిక ప్రత్యేక ఏర్పాటుతో మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా, సైన్స్ ప్రాముఖ్యతను గుర్తెరిగేలా చక్కటి కార్యక్రమం ఏర్పాటు చేసింది.

జన విజ్ఞాన వేదిక ఏర్పాటు చేసిన కార్యక్రమం ఐక్యత, సమైక్యత. ప్రస్తుత సమాజంలో ఐక్యత,సమైక్యత ప్రాధాన్యత ఎంతో ఉందని తెలియజెప్పేలాఒక యూనిట్ ఏర్పాటు చేశారు. సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఇది ఒక హైలెట్ గా చెప్పుకోవచ్చు. సిఐటియు 18వ జాతీయ మహాసభలను గుర్తు చేస్తూ, ఒక్కొక్క మహాసభ వివరం తెలుపుతూ 18 మహాసభల పత్రాలను ఏర్పాటు చేశారు. ఇదే సందర్భంలో ఒక చిన్న సర్కులర్ రైలు (బ్యాటరీతో నడిచే) ఏర్పాటు చేసిన తీరు అద్భుతంగా ఉంది.

ఇక ప్రింటింగ్ రంగంలో రోజు రోజుకు నూతన పోకడలు వస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో వస్తున్న 3 డి ప్రింటింగ్ ఒకటి. కొంతమందికి మాత్రమే దీని గురించి తెలిసినప్పటికీ, 3డి ప్రింటింగ్ మిషన్ ఏ విధంగా పనిచేస్తుందో అవగాహన కలిగించే కార్యక్రమాన్ని పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులు ఏర్పాటు చేశారు. పెట్రోల్, డీజిల్ వినియోగం వచ్చే కాలుష్యం మానవాళికి హానికరం. దీనికి ప్రత్యామ్నాయం ఉందని నిరూపించేలా కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు ఏర్పాటు చేసిన కప్పరెన్స్ ఎనర్జీ యూనిట్ ప్రాజెక్టు రుజువు చేస్తోంది. ఇక్కడ ఏర్పాటు చేసిన మోడల్ పనితీరును తిలకించడానికి వచ్చిన వారికి విద్యార్థులకు ఎంతో చక్కగా, అర్థమయ్యేలా వివరిస్తున్నారు. పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు విద్యుత్తు జనరేషన్ (ఉత్పత్తి) నుంచి మనం వాడుకునే వరకు జరిగే వివిధ పరిణామక్రమాలను వివరిస్తూ ఏర్పాటు చేసిన ప్రాజెక్టు ఆసక్తికరంగా ఉంది. సోలార్ విద్యుత్తు అవసరం గురించి చెబుతూ, దాన్ని ఎలా పొందవచ్చో వివరిస్తున్నారు.

గాయత్రి పరిషత్ (జివిపి) మెడికల్ కాలేజీ విద్యార్థులు మానవ శరీరంలో వివిధ భాగాలు ఏ విధంగా పనిచేస్తాయనే ప్రాజెక్టు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా జీర్ణ వ్యవస్థ, మెదడు, శరీరంలోని వివిధ భాగాల పనితీరును ఈ యూనిట్‌లో ఏర్పాటు చేసిన విద్యార్థులకు వివరిస్తున్నారు. ఇదే సందర్భంగా విశాఖ వంటి నగర ప్రాంతంలో అధికంగా ఉన్న అధిక బరువుతో మనిషి ఎదుర్కొనే ఆరోగ్య ఇబ్బందులు గురించి, ఈ సమస్యను అధిగమించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరిస్తున్నారు. పౌష్టికాహారం ప్రాధాన్యత గురించి కూడా చెప్పడం విశేషం. ఇక దోమల వల్ల కలిగే నష్టాలు, ముఖ్యంగా డెంగీ వంటి ప్రమాదకరమైన జ్వరం గురించి వివరిస్తూ, ఈ జ్వరం ఎందుకు వస్తుంది, అది రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరిస్తున్నారు.

తగరపువలస ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ విద్యార్థులు గుండె జబ్బులు అధికంగా రావడానికి గల కారణాలు గురించి వివరించే ప్రాజెక్టు ఏర్పాటు చేశారు. షుగర్ వ్యాధి రాకుండా, వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. గుండె జబ్బులు రావడానికి ముఖ్య కారణం ఆల్కహాల్, స్మోకింగ్ వంటివి ప్రమాదకరమని, వీటికి దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. నిత్యం వ్యాయామం చేయాల్సిన అవసరం గురించి వివరిస్తూ, పౌష్టికాహారం ప్రాధాన్యతను తెలియజేస్తూ వివిధ చార్టులను ఏర్పాటు చేశారు. ఇదే సందర్భంగా బిపి, బరువు తెలుసుకునే యూనిట్ ఏర్పాటు చేశారు. ఇది కూడా బాగా ఆకట్టుకుంది. ఇవే కాకుండా మరెన్నో ఆసక్తికరమైన సైన్స్ యూనిట్లు ఇక్కడ ఏర్పాటు చేయటం విశేషం. ఇంత చక్కటి సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటుకు కారణమైన సిఐటియు 18వ మహాసభలు విజయవంతం కావాలని ఆశిద్దాం.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఆకట్టుకున్న ఓ నమూనా

సైన్స్ ఎగ్జిబిషన్‌కు పోటెత్తిన విద్యార్థులు, నగర వాసులు

ప్రజాశక్తి
www.prajasakti.com
విశాఖపట్నం, అనకాపల్లి
మంగళవారం 30 డిసెంబర్ 2025

కోలాటం ప్రదర్శిస్తున్న విశాఖ మహిళా కళాకారులు

సాగర తీరాన.. కార్మిక పండగ

శ్రామిక ఉత్సవ్‌కు విశేష స్పందన
మూడో రోజూ సందడిగా సాహిత్య, విజ్ఞాన, సాంస్కృతిక వేదికలు

సిఐటియు 18వ అఖిల భారత మహాసభ సన్నద్ధంగా సాగర తీరంలో తలపెట్టిన 'శ్రామిక ఉత్సవ్' పండగ వాతావరణాన్ని తలపిస్తోంది. ఈ నెల 27న ప్రారంభమైన ఈ ఉత్సవ్ ప్రాంగణం ప్రజానీకం ఉత్తేజ, ఉత్సాహ డోలికలతో కొత్త సందడిని సంతరించుకుంటోంది. మూడో రోజు సోమవారం సాయంత్రం సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అధ్యక్షతన 'స్త్రీ పురుష సమానత్వం' థీమ్‌తో జరిగిన సభకు ముఖ్య అతిథిగా కవి, సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ హాజరై అభ్యుదయ, విప్లవకర సినిమా పాటలతో అలరించారు. శ్రామిక సంస్కృతిని తెలియజెప్పారు. సభకు ముందు ఆయన ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లోగల బుక్‌స్టాల్స్ అన్నీ కలియతిరిగారు. సభికులందరినీ ఏకరీతిన ఆనందోత్సాహంలో ముంచెత్తుతూ మరో విశిష్ట అతిథి జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ పుస్తక మహోత్సవ స్టాల్స్‌ను సందర్శించారు. సైన్స్, ఫొటో ఎగ్జిబిషన్లు ఆకట్టుకున్నాయి.

CITU
18th ALL INDIA CONFERENCE
2025 DEC 31 - 2026 JAN 4, VISAKHAPATNAM

బాల కళాకారులకు ప్రసంశాపత్రాలు అందజేస్తున్న సుద్దాల అశోక్‌తేజ, చిత్రంలో నర్సింగరావు, రమాదేవి

ఆకట్టుకున్న విభిన్న కళారూపాలు

ప్రజాశక్తి - భీమునిపట్నం

సిఐటియు అఖిల భారత మహాసభల నేపథ్యంలో విశాఖ ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో శ్రామిక ఉత్సవ్ పేరిట చేపడుతున్న సాంస్కృతిక కార్యక్రమాలు మూడో రోజు అదే ఉత్సాహంతో కొనసాగుతున్నాయి. కవి యాదగిరి రాసిన "ఆటాడుకుందాం.. పాట పాడుకుందాం... అందరం కూడా మాట్లాడుకుందాం.. అన్న ఆనాటి రోజులను గుర్తు చేస్తూ 'ఆటలన్నీ పోయే, మాటలన్నీ కనుమరుగాయే' పాటను పాడుతూ ఆకట్టుకున్నారు. ఇంటింటా ఇంటర్నెట్, చేతిలో సెల్ ఫోన్, ఇంట్లో టీవీ, జన బాహుల్యంలోకి రావడంతో విదేశీ సంస్కృతి జడలు విప్పుతున్న వైనాన్ని పాట రూపంలో కళాకారులు వివరించారు.

నౌకాశ్రయాలు, విమానాశ్రయాలు, రోడ్లు, రైల్వే, ప్రభుత్వాసుపత్రులు, విద్య ప్రైవేటీకరణ అవుతున్న నేపథ్యాన్ని వివరిస్తూ పాలకుల ప్రైవేటీకరణ విధానాలను ఎండగడుతూ.. 'ప్రతిదీ ప్రైవేటు రా... ప్రజలపైన వేటు రా .. దేశానికి చేటు రా' అంటూ ప్రజానాట్య మండలి కళాకారులు అనిల్ పాడిన పాట సభికులను ఆలోచింపజేసింది. మన డబ్బుతో నిర్మించిన ఫ్యాక్టరీలు బహుళ జాతి సంస్థలకు పాలకులు ఎలా కట్టబెడుతోందోకళాకారుల పాట రూపంలో వివరించారు.

అరకు, పద్మాపురం గ్రామాలకు చెందిన గిరిజన మహిళలు, పురుషులు ప్రదర్శించిన "థింసా నృత్యం" గిరిజనుల ఐక్యతను చాటేలా ఉంది. లయబద్ధంగా గిరిజన డప్పు కళాకారుల వాయిద్యం, థింసా నృత్యం సభికులను కట్టి పడేసింది. మతాలు వేరైనా మనమంతా ఒక్కటిగా నిలవాలన్న సందేశాన్ని ఇచ్చే 'ఆత్మలను పలికించేదే అసలైన భాష, ఆ విలువ కరువైపోతే అది కంఠశోష" అన్న పాటను ప్రజానాట్య మండలి రాష్ట్ర కళాకారులు ఆలపించారు.

పూలే, సావిత్రీబాయి పూలే స్ఫూర్తితో మహిళలకు చదువు ప్రాధాన్యత తెలుపుతూ రాజేశ్వరి బృందం ఆధ్వర్యంలో వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ చిన్నారులు ప్రదర్శించిన 'మన జీవితాల్లో వెలుగులు నింపెను, వెలుగుల రాదారి" నృత్యం సభికులను ఆలోచింపజేసింది. 'ఈ దేశపు తొలి పంతులమ్మగా చేరి, మన జీవితాల్లో నింపెను వెలుగులు' అన్న పాట ఆకట్టుకుంది.

'సంపద సృష్టికి మూలం, చెమట చుక్కలే' అంటూ ప్రజానాట్య మండలి రాష్ట్ర నాయకులు ఐవి పాడిన గేయం కష్ట జీవులు, కార్మికుల శ్రమను గుర్తుచేసింది. అలాగే 'సుత్తీ, కొడవలి అందుకో' చెమట చుక్కలా ఎర్ర జెండా' అంటూ ఆయన ఆలపించిన గేయం ఎర్ర జెండా ప్రాధాన్యత, విశిష్టత ను తెలిపింది.

'దేశమంటే మట్టి కాదోయ్'... 'దేశమంటే మనుషులోయ్'

అన్న గురజాడ మాటలను ప్రస్తావిస్తూ గురజాడ గొప్ప తనాన్ని, తెలుగు భాష ఔన్నత్యాన్ని వివరిస్తూ ఏలూరు కళాకారులు నృత్య ప్రదర్శన చేశారు.

'ఘనమైన చరితే నీది ఎర్ర జెండా'
'నీకుంది పేద ప్రజల అండ దండ'

అంటూ ఎర్ర జెండా ప్రాధాన్యతను తెలుపుతూ ప్రజా నాట్య మండలి రాష్ట్ర నాయకులు జగన్ ఆధ్వర్యంలో కళాకారులు పాడిన గేయం సభికులను ఉత్సాహ పరిచింది.

ఉత్సవ్ ప్రాంగణంలో కళాకారులు

కేరళ మాజీ మంత్రి టిపి.రామకృష్ణన్‌కు స్వాగతం పలుకుతున్న నర్సింగరావు తదితరులు

కరీంకు స్వాగతం పలుకుతున్న నాయకులు

సుద్దాల అశోక్‌తేజకు అపూర్వ స్వాగతం

మాట్లాడుతున్న అశోక్ తేజ

ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కరీం, రామకృష్ణన్ తదితరులు

ఆకట్టుకున్న కళారూపాలు

గురజాడ స్ఫూర్తి గీతానికి కళాకారుల నృత్య ప్రదర్శన

కేరళ కళాకారుల సంప్రదాయ నృత్యం

అల్లూరి సీతారామరాజు నాటికలోని ఓ సన్నివేశం

జివిఎంసి కమిషనర్‌తో కరీం, టిపి.రామకృష్ణన్ మాటామంతీ

మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న సుద్దాల అశోక్‌తేజ, చిత్రంలో రాంభూపాల్, హరికిషోర్, మధు, రాజేష్‌రెడ్డి

పుస్తకం జ్ఞాన శిఖరం : సుద్దాల అశోక్ తేజ

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ

సిఐటియు 18వ జాతీయ మహాసభల సందర్భంగా విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న పుస్తక మహోత్సవం మూడో రోజు అత్యంత ఉత్సాహభరితంగా సాగింది ఈ ప్రదర్శనను సోమవారం సాయంత్రం ప్రముఖ సినీ గేయ రచయిత, జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ వీక్షించారు. పుస్తక ప్రదర్శనలోని వివిధ స్టాల్స్‌ను సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, పుస్తకం గొప్పతనాన్ని కొనియాడారు. మానవ పరిణామ క్రమంలో పుస్తకం ఒక గొప్ప ఆయుధం. అది కేవలం అక్షరాల సమాహారం కాదు, తరతరాల అనుభవాన్ని, జ్ఞానాన్ని అందించే మార్గదర్శి అని పేర్కొన్నారు. సమాజంలో వస్తున్న మార్పులను అర్థం చేసుకోవడానికి, అన్యాయాలను ఎదిరించడానికి పఠనాసక్తి ఎంతో అవసరమని సూచించారు. ప్రదర్శనలో ఏర్పాటు చేసిన అరుదైన గ్రంథాలను, చారిత్రక, రాజకీయ విశ్లేషణలతో కూడిన ప్రత్యేక పుస్తకాలను సుద్దాల ఆసక్తిగా వీక్షించారు. కొన్ని పుస్తకాల పూర్వపరాలను, వాటి విశిష్టతను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి పుస్తక మహోత్సవాలు ప్రజల్లో ముఖ్యంగా యువతలో ఆలోచనా దృక్పథాన్ని పెంపొందిస్తాయని ప్రశంసించారు.

నిర్వాహకులకు అభినందనలు

సిఐటియు మహాసభల నేపథ్యంలో కేవలం రాజకీయ చర్చలకే పరిమితం కాకుండా, విజ్ఞానాన్ని పంచే పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేయడం పట్ల నిర్వాహకులను అశోక్‌తేజ అభినందించారు. ఈ ప్రదర్శనకు వస్తున్న విశేష స్పందన పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తూ, ఈ కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగాలని ఆకాంక్షించారు. సుద్దాల అశోక్ తేజ రాకతో ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో పండుగ వాతావరణం నెలకొంది. తమ అభిమాన రచయితను చూడడానికి, ఆయనతో ఫోటోలు దిగడానికి సందర్శకులు పోటీ పడ్డారు. ప్రతి ఒక్కర్నీ చిరునవ్వుతో పలకరిస్తూ, ఆప్యాయంగా వారితో ఫోటోలు దిగి అందర్నీ ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ప్రతినిధులు, పుస్తక ప్రేమికులు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

'శ్రామిక ఉత్సవ్'ను సందర్శించిన జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్

ప్రజాశక్తి ఎంవిపి కాలనీ

ఈనెల 31 - జనవరి 4 వరకు జరగనున్న సిఐటియు జాతీయ మహాసభలు సందర్భంగా ముందస్తు కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటు చేసిన 'శ్రామిక ఉత్సవాల'ను జివిఎంసి కమిషనర్ పి.కేతన్‌గార్గ్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా 'బాల్య వివాహాలను నిర్మూలిద్దాం' అన్న అంశంపై ప్రదర్శించిన లఘుచిత్రాన్ని ఆయన వీక్షించారు. సమాజంలో చైతన్యం తీసుకురావడానికి ఇలాంటి చిత్రాలు ఎంతో దోహదపడతాయన్నారు. అలాగే చిత్ర బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఇదే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సైన్స్, ఫోటో,కార్టూన్ ప్రదర్శనలను ఆయన నిశితంగా పరిశీలించారు. ఫోటో ఎగ్జిబిషన్ చరిత్రకు అద్దం పట్టేలా ఉందని కొనియాడారు. పుస్తక ప్రదర్శనను సందర్శించిన ఆయన ప్రస్తుత టెక్నాలజీ యుగంలో విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకొనేలా ప్రోత్సహించాలని సూచించారు. చివరిగా సిఐటియు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమాలు ప్రజల్లో అవగాహన పెంచేలా ఉన్నాయని, ఈ మహాసభలు, అనుబంధ కార్యక్రమాలు విజయవంతం కావాలని కోరుకుంటున్నానని అన్నారు.

పోరాటాల రంగం... సిఐటియు సంఘం

విజయనగరంలో కార్మికులు చేపట్టిన భారీ ర్యాలీ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

కార్మికులకు అండగా... శ్రమజీవులకు శక్తిగా... చిరుద్యోగుల గుండె చప్పుడుగా అనేక పోరాటాలు, ఎన్నో విజయాలు, మరెన్నో ప్రగతిశీల లక్ష్యాలతో ముందుకు సాగుతున్న సిఐటియు మరో అడుగు ముందుకు వేస్తోంది. ఓవైపు పెట్టుబడిదారులు, కార్పొరేట్‌శక్తుల శ్రమదోపిడీ, ఉద్యోగులపై వేధింపులు పెరుగుతుండగా, మరోవైపు ఎర్రజెండా నీడలో సిఐటియు ఆధ్వర్యాన విజయనగరం జిల్లాలో పోరాటాలు ఉవ్వెత్తున సాగుతున్నాయి. పోరాటాల ద్వారా ఎన్నో కార్మికులు ఎన్నో సమస్యలను పరిష్కరించుకున్నారు. ఇటువంటి సందర్భంలో సిఐటియు అఖిల భారత 18వ మహాసభలు పక్కనే ఉన్న విశాఖ జిల్లా వేదికైంది. బీచ్‌రోడ్డులోని ఎయు కన్వెన్షన్ సెంటర్‌లో ఈనెల 31 నుంచి జనవరి 4వరకు జరగనున్నాయి. ఈ మహాసభల నేపథ్యంలో విజయనగరం జిల్లాలో సిఐటియు చేసిన పోరాటాలు, విజయాలను కార్మికులు గుర్తు చేసుకుంటున్నారు.

విజయనగరం జిల్లాలో కార్మికులు తమ సమస్యలు పరిష్కరించుకునేందుకు, హక్కులను పరిరక్షించుకునేందుకు ఎన్నో బెదిరింపులు, నిర్బంధాలు ఎదుర్కొన్నారు. మరిన్ని సమస్యలు పరిష్కరించుకుని

సమస్యలపై ఎన్నో ఆందోళనలు
నిర్బంధాలను ఎదుర్కొంటూ.. నిర్భయంగా ముందుకు సాగుతూ

యాజమాన్యాల మెడలు వంచారు. కొన్ని దశాబ్దాలుగా జిల్లాలో ప్రధానమైన జ్యూట్, ఫెర్రోఎల్లాయిస్ పరిశ్రమలు మూతపడడం వల్ల జిల్లా పారిశ్రామికంగా మరింత వెనుకబడిన విషయం విధితమే. ఈస్ట్‌కోస్ట్, అరుణా, బొబ్బిలి గోపాలకృష్ణ, జ్యోతి జ్యూట్ మిల్లులు మరికొన్ని పరిశ్రమల స్థలాలు రియల్ ఎస్టేట్‌గా మారిపోయాయి. దీంతో పారిశ్రామిక రంగంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 20వేలమంది కార్మికులు శాశ్వతంగా ఉపాధికి దూరమయ్యారు. ఈ ప్రభావం విజయనగరం, గరివిడి, కొత్తవలస, బొబ్బిలి ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. పారిశ్రామిక సంక్షోభాన్ని అధిగమించి జిల్లాలో నిలదొక్కుకుంటున్న మైలాన్, హెబిఎల్, సిపి ఆక్వా, ఎస్‌ఎంఎస్, విజయనగర్ బయోటెక్ పరిశ్రమలతో పాటు హేచరీస్, పౌల్ట్రీస్ తదితర పరిశ్రమల్లో కార్మికులు రకరకాల సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రభుత్వమే ఇసుక వ్యాపారం మొదలెట్టిన తర్వాత నిర్మాణ రంగ కార్మికులు చాలా వరకు ఇబ్బందులు పడుతున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఆ రంగం ఈ రంగం కాదు. అన్ని రంగాల్లోనూ కార్మికులు ఇబ్బందులు పడుతు న్నారు. మరోవైపు రెండో ఎఎన్ఎం, విఆర్‌ఎలు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం తదితర స్కీమ్ వర్కర్లు, గ్రీన్ అంబాసిడర్లు సమస్యలైతే అన్నీ ఇన్నీ కావు. ప్రభుత్వం అవలంభిస్తున్న మోసపూరిత విధానం వల్ల ఉద్యోగ భద్రత లేదు. పనికి తగ్గ వేతనం లేదు. పని ఒత్తిడి ఎక్కువైంది. బండెడు చాకిరీ మోస్తున్నా రాజకీయ వేధింపులు తప్పడం లేదు. ఇటువంటి పరిస్థి తుల్లో వీరికి సిఐటియు అండగా నిలుస్తూ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తోంది.

గర్భాం ఆంధ్రా ఫెర్రో కార్మికులు చేపట్టిన ఆకలియాత్ర (ఫైల్)

తలపెట్టిన పోరాటాలు.. సాధించిన విజయాలు

- మైలాన్‌లో 2020లో కాంట్రాక్టు వర్కర్స్‌కు జరిగిన వేతన ఒప్పందంలో ఒక్కొక్క కార్మికునికి రోజుకు రూ.72 వేతనం పెరిగింది.
- మైలాన్‌లో ఆపరేటర్లు 2021లో జరిగిన వేతన ఒప్పందంలో భాగంగా ఒక్కొక్క కార్మికునికి నెలకు రూ.8వేలు వేతనం పెరిగింది.
- భోగాపురం శ్రీనివాస హేచరీస్‌లో 2021లో వేతన ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా ఒక్కొక్క కార్మికునికి నెలకు రూ.2,500 నుంచి రూ.3వేల వరకు పెరిగింది.
- గరివిడి మైన్స్‌లో 2020లో జరిగిన వేతన ఒప్పందం ద్వారా ఒక్కొక్క కార్మికునికి రోజు రూ.600 వేతన ఒప్పందం జరిగింది. 58 రోజులు వేతనాన్ని గ్రాట్యూటీగా సాధించుకున్నారు.
- విజయనగరంలోని చందనా బ్రదర్స్ కోవిడ్ కాలంలో మూసివేయగా, మూడునెలల పాటు పోరాటం సాగింది. కార్మికులకు శాశ్వత సెటిల్‌మెంట్ జరిగింది. ఒక్కొక్క కార్మికుడు సుమారు రూ.2 లక్షల నుంచి రూ.5లక్షల సాధించుకున్నారు.
- 2023లో అంగన్వాడీలు 42రోజుల సమ్మె కాలంలో విజయనగరం జిల్లాలో 13చోట్ల శిబిరాలు నడిచాయి. ధర్నాలు, రాస్తారోకో వంటి ఆందోళనలు చేపట్టారు. మంత్రుల ఇళ్లముట్టడి కార్యక్రమాలకు కూడా వెనుకాడలేదు. ఫలితంగా 60ఏళ్ల రిటైర్‌మెంట్ వయసును ప్రభుత్వం 62ఏళ్లకు పెంచారు. ఉద్యోగ విరమణ సందర్భంగా వర్కర్లు రూ.1.50లక్షలు, ఆయాలకు రూ.50వేలు ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రకటించింది. మినీ సెంటర్లు మెయిన్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు వర్కర్లకు ప్రమోషన్ కల్పించేందుకు ప్రభుత్వం దిగివచ్చింది.
- ఈ ఏడాది గజపతినగరం మండలం రామన్నపేటలోని అంగన్‌వాడీ వర్కర్‌ను రాజకీయ కక్షసాధింపులతో తొలగింపునకు వ్యతిరేకంగా చేసిన పోరాటానికి అధికార యంత్రాంగం దిగిరాక తప్ప లేదు.
- ఈ ఏడాది ఆశా వర్కర్లు సిఐటియు అండతో వివిధ సమస్యలపై డిఎం అండ్ హెచ్ఒ, కలెక్టర్ ఆఫీస్ వద్ద 6 గంటల పాటు వంటా, వార్పు కార్యక్రమం పెద్దఎత్తున చేపట్టారు. ఈ క్రమంలో ఆశా కార్యకర్తలు మెటర్నటరీ వేతనంతో కూడిన సెలవుతోపాటు అనేక సమస్యలను పరిష్కరించుకున్నారు.
- 2024లో నెల్లిమర్ల మిమ్స్ కార్మికులు తొలగింపు, బకాయి డిఎలు, పని ఒత్తిడి తగ్గించాలని 2 నెలలకు పైగా సమ్మె జరిగింది. తొలుత మొండిగా వ్యవహరించిన యాజమాన్యం, ప్రభుత్వ జోక్యంతో దిగరాక తప్పలేదు. 23 మందిపై అక్రమ కేసులు పెట్టి 13 రోజుల పాటు సెంట్రల్‌జైలు, సబ్‌జైల్లో పెట్టారు. చివరకు రాష్ట్ర నాయకత్వం సహకారంతో లేబర్ ఆఫీస్‌లో ఒప్పందం కుదిరింది. నూతన వేతన ఒప్పందం చేశారు.
- ఈ ఏడాది గరివిడి మండలం దేవాడ మైన్స్ లీజు ఒప్పందం పూర్తయిన నేపథ్యంలో స్థానిక కార్మికుల తొలగింపు చర్యలు సిఐటియు పోరాటంతో ఆగాయి.
- రామభద్రపురం, ఎస్.కోట, పురిటిపెంట, గజపతినగరం, ఎల్.కోట, గరివిడి మేజర్ పంచాయతీల్లో జీతాలు పెంచాలని, బకాయి జీతాలు చెల్లించాలని 4 రోజుల నుంచి 26 రోజుల వరకు వివిధ పంచాయతీల్లో గ్రీన్ అంబాసిడర్ల సమ్మె శిబిరాలు జరిగాయి.
- ప్రమోషన్లు ఇవ్వాలని సచివాలయ ఎఎన్ఎంలు కొంతకాలంగా పోరాడి విజయం సాధించారు. ఫలితంగా 156 మంది ప్రమోషన్లు పొందారు.

కవులే శ్రామికోద్యమ నిర్మాతలు

- జాతీయోద్యమంలో తెలుగు సాహిత్యం కీలకపాత్ర
- ఎయు విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ వెలమల సిమ్మన్న

ప్రజాశక్తి - ప్రత్యేక ప్రతినిధి

కవులు, రచయితలు శ్రామికోద్యమానికి నిర్మాతలు కావాలని ఆంధ్రాయూనివర్శిటీ తెలుగు విభాగం విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ వెలమల సిమ్మన్న ఆకాంక్షించారు. ప్రభుత్వ విధానాల వల్ల నేడు కార్మికవర్గం తీవ్ర ఒత్తిడి, శ్రమదోపిడీ ఎదుర్కొంటుందని, భవిష్యత్తులో మరింత నిర్బంధ చర్యలు పెరిగే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో నాటి జాతీయోద్యమ స్ఫూర్తితోనే కార్మికోద్యమానికి సన్నద్ధం కావాల్సిన ఆవశ్యకతను వివరించారు. సిఐటియు అఖిలభారత మహాసభల సందర్భంగా ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో శ్రామిక ఉత్సవ్ జరుగుతున్న శ్రామిక సాహితీవేదికపై 'జాతీయోద్యమంలో తెలుగు సాహిత్యం' అన్న అంశంపై సాహితీ స్రవంతి శ్రీకాకుళం జిల్లా కన్వీనర్ కేతవరపు శ్రీనివాస్ అధ్యక్షతన సభలో ఆయన మాట్లాడారు. జాతీయోద్యమంలో తెలుగునాట కవులు, రచయితలు, కళాకారులు కీలకపాత్ర పోషించారంటూ చరిత్రను విరించారు. నాడు కవులు కుల, మతాలకతీతంగా ప్రజలను ఐక్యంచేసి స్వాతంత్ర్యాన్ని సాధించేందుకు కృషి చేస్తే, నేటి పాలకులు మతాల మధ్య చిచ్చుపెడుతూ ఐక్యతను దెబ్బతీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తద్వారా కార్మికుల ఐక్యతను దెబ్బతీయడం ద్వారా వారిపై భారాలు మోపడం, భద్రత లేకుండా చేయడం, శ్రమను దోచుకోవడం వంటివాటికి పాల్పడుతున్నారని వివరించారు. ఇటువంటి తరుణంలో 'స్వాతంత్ర్యం వచ్చెనని సంబర పడగానే సరిపోదోయి... సాధించిన దానికి సంతృప్తిని పొంది, అదే విజయమనుకుంటే పొరపాటోయి' అంటూ శ్రీశ్రీ రాసిన గేయాన్ని నేటి కవులంతా స్ఫూర్తిగా తీసుకుని ముందుకు తీసుకెళ్లాని పిలుపునిచ్చారు. కవి, తెలుగు పండితులు బాడాన శ్యామలరావు మాట్లాడుతూ సిపాయిల తిరుగుబాటు, క్విట్ ఇండియా ఉద్యమం వంటి అన్ని కీలక సందర్భాల్లో తెలుగు కవులు, రచయితలో ప్రజల్ని చైతన్యపర్చారని అన్నారు. కవులు రగిలించిన ఉద్యమ స్ఫూర్తితో స్వాతంత్ర్యం కోసం ఎంతో మంది ప్రాణాలర్పించేందుకు వెనక్కితగ్గలేదన్నారు. నేడు పాలకులు మోపుతున్న కష్టనష్టాలపై కవితలు రాస్తే తట్టుకోలేకపోతున్నారని, ఫలితంగా శ్రామికుల సమస్యలు మరుగునపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అయినప్పటికీ నేతరం కవులు జాతీయోద్యమ స్ఫూర్తితో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. 'మాకొద్దీ తెల్లదొరతనం' అంటూ కవి గరిమెళ్ల సత్యనారాయణ బ్రిటీష్ పాలకులపై గర్జించిన తీరును అర్థం చేసుకుని ముందుసాగాల్సిన అవసరం ఉందన్నారు. డివి సూర్యారావు మాట్లాడుతూ గురజాడ మొదలుకుని ఎంతో మంది కవులు దేశభక్తి భావాలను రగిలించి, స్వాతంత్రోద్యమం కోసం పరితపిస్తే నేటి పాలకులు ఆ స్ఫూర్తిని దెబ్బతీస్తున్నారని అన్నారు. జాతిని విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నం చేస్తున్న నేపథ్యంలో కవులు, రచయితలు మరోసారి సమయాత్తం కావాల్సిన అవసరం ఉందన్నారు. బద్రి కూర్మారావు మాట్లాడుతూ శ్రీకాకుళం గిరిజన

మాట్లాడుతున్న డాక్టర్ సిమ్మన్న

రైతాంగ పోరాటం, మందస జమిందారీపోరాటం, నైజాం వ్యతిరేకోద్యమాల్లో కూడా తెలుగు సాహిత్యం కీలకపాత్ర పోషించిందని గుర్తుచేశారు. సభాధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ గురజాడ, కందుకూరి, శ్రీశ్రీ, ఉన్నవల లక్ష్మీనారాయణ వంటి కవులను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా నేటి సమాజంలో శ్రామికవర్గంపై జరుగుతున్న దాడితో పాటు విచ్ఛిన్నకర శక్తుల కుట్రను కవితులు, రచనల ద్వారా బయటపెట్టి, ప్రజల్ని అప్రమత్తం చేయాలని కోరారు.

కార్యక్రమంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ, సాహితీ స్రవంతి విశాఖ జిల్లా కార్యదర్శి పెంటకోట రామారావు, నాయకులు చలపతిరావు పాల్గొన్నారు. సభలో ప్రసంగించిన కవులందరికీ సాహితీ స్రవంతి నాయుల చేతులమీదుగా శ్రమ అవార్డులు ప్రదానం చేశారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం

సహచర మిత్రుని కుటుంబానికి ఆర్థిక సాయం



వరహాలరావు కుటుంబానికి సాయం చేస్తున్న పూర్వ మిత్రులు

ప్రజాశక్తి -పరవాడ: మండలంలోని చీపురుపల్లి జెడ్‌పి ఉన్నతపాఠశాల 2000-001 టెన్త్ క్లాస్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఔదార్యాన్ని చాటుకున్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తమ బ్యాచ్‌మేట్ నాయుడుపాలెం గ్రామానికి చెందిన దాసరి వరహాలరావు కుటుంబానికి ఆర్థికసాయం చేసి అండగా నిలిచారు. ఈ బ్యాచ్‌కు చెందిన అబ్బాయిలు, అమ్మాయిలు ఒక్కొక్కరు రూ.1000 చొప్పున విరాళంగా సేకరించి, మొత్తం రూ.63వేలను వరహాలరావు భార్యకు సోమవారం పెద్దకర్మ రోజున అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ, ఆర్థిక సహాయాన్ని పిల్లల చదువుకు వినియోగించుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ఎలాంటి అవసరమైనా తామంతా అండగా ఉంటామని భరోసానిచ్చారు. గురుమూర్తి రెడ్డి, మహాలక్ష్మి నాయుడు, బంగార్రాజు, వరహాలరావు, నర్సింగరావు, దేవుడు, కనకాపురం సంతోష్, కల్పన పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కప్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

పెదపల్లిలో టోర్నీ ప్రారంభిస్తున్న సతీష్

ప్రజాశక్తి- యలమంచిలి టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని పెదపల్లి గ్రామంలో ఎమ్మెల్యే కప్ క్రికెట్ టోర్నమెంట్‌నుర సోమవారం జనసేన నాయకుడు సుందరపు సతీష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ, క్రీడల్లో పాల్గొనడం ద్వారా యువతకు ఆరోగ్యం మెరుగుపడడంతో చెడు వ్యవనాలకు దూరంగా ఉండే అవకాశం ఉందన్నారు. పెదపల్లి జనసేన పార్టీ అధ్యక్షులు బొద్దపు గణేష్ మాట్లాడుతు సంక్రాంతి పండుగ సందర్భంగా పెదపల్లి కూటమి నాయకులు ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లాస్థాయి టోర్నీలో 45 జట్లు తమ పేర్లు నమోదు చేసుకున్నాయని,వచ్చేనెల20న ఫైనల్ మ్యాచ్‌తోటోర్నీ ముగుస్తుందన్నారు. ఆరోజున విజేతలకు ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ట్రోఫీ, బహుమతులు అందజేస్తారన్నారు. విజేతలకు రూ.50వేలు, రన్నరప్‌కు రూ.30వేలు, మూడోస్థానంలో నిలిచిన జట్టుకు రూ.15వేలు నగదుతోపాటు ట్రోఫీ అందజేస్తామన్నారు. మరిసా సత్తిబాబు, టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి బొద్దపు రమణ, బొద్దపు అశోక్, శివ, ఎంపిపిరాజన శేషు, ఐ సన్యాసి నాయుడు, గోపినాథ్, వూటకోటి రమేష్, కోటారు నరేష్, లావుడు లోవరాజు, పల్లా సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎన్‌జిఒల చైర్‌పర్సన్‌గా స్వర్ణలత

ప్రజాశక్తి- సబ్బవరం : ఎపిఎన్‌జివోల అసోసియేషన్ అనకాపల్లి జిల్లా చైర్‌పర్సన్‌గా సబ్బవరం పిహెచ్‌సి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎడ్ల స్వర్ణలత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు తనను బలపరిచి ఏకగ్రీవంగా ఎన్నుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతగా ఎన్జీవోల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. .

స్వర్ణలతను సత్కరిస్తున్న ఎన్‌జివో యూనియన్ ప్రతినిధులు

నిధుల లేమితో సేవలకు ఇబ్బంది

మునగపాక మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌ల ఆవేదన

ప్రజాశక్తి - మునగపాక: నిధులు కొరతతో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు ఇబ్బందులు పడుతున్నామని మండలంలోని పలువురు సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో ఎంపిపి మళ్ల జయలక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో పలువురు సర్పంచులు మాట్లాడుతూ వీధిలైట్లు వేయడానికి, పారిశుధ్య నిర్వహణకు, కార్మికుల జీతాలు చెల్లింపునకు పంచాయితీల్లో నిధులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని సభలో ప్రస్తావించారు. జెడ్‌పిటిసి సభ్యులు పెంటకోట స్వామి సత్యనారాయణ మాట్లాడుతూ అధికారుల అలసత్వం వల్ల ఎంపీటీసీలకు, సర్పంచులకు పనులు జరగట్లేదని, కూటమి నేతలు చెప్పిన వారికే పనులు చేస్తున్నారని ఆరోపించారు. మండల కేంద్రం మునగపాకలో పశు వైద్యాధికారి లాంగ్ లీవ్ పెట్టి వెళ్లిపోయారని, దీంతో పశువైద్యానికి ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ప్రస్తుతం ఒక అసిస్టెంట్ ను నియమించారని, అయినా రైతులకు ఎటువంటి పనులు జరగట్లేదని, తక్షణమే ప్రభుత్వం స్పందించి పశువైద్యాధికారిని నియమించి పాడి రైతులకు జరిగే ఇబ్బందులు తొలగించాలని సమావేశంలో తీర్మానించాలని కోరారు.

గ్రామాల్లో బెల్టు షాపులు విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారని, అర్ధరాత్రి దాటిన తర్వాత కూడా మందుబాబుల వీరంగంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీరి కట్టడి చేయడంలో పోలీసులు చర్యలు చేపట్టాలని ఎంపిటిసి వీరు నాయుడు ఆరోపించారు. తోటాడలో సీసీ రోడ్డులో అడ్డుగా ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి, వేరేచోట ఏర్పాటు చేయాలని గవర్ల అనకాపల్లి ఎంపిటిసి కాండ్రేగుల వెంకటలక్ష్మి సూచించారు. తల్లికి వందనం నిధులు ఎందరికి ఇచ్చారో స్పష్టతనివ్వాలని మునగపాక ఎంపిటిసి సూరిశెట్టి రాము కోరారు. సమావేశంలో ఎంపిడిఒ ఉషారాణి, ఎఒ ప్రసాద్ కుమార్, సర్పంచ్ లు సుందరపు తాతాజీ, బొడ్డేడ శ్రీనివాసరావు, బి శెట్టిగంగప్పల నాయుడు, చదరం గణేష్ నాయుడు, ఎంపిటిసిలు మొల్లేటి కృష్ణవేణి, శరగడం అప్పల నరసమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి సత్యనారాయణ

ఉద్యోగ భద్రత కల్పించాలని మీటర్ రీడర్స్ నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి : తమకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనాలు చెల్లించాలని మీటర్ రీడర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు, యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు శంకరరావు, బి శ్రీనివాసరావు మాట్లాడుతూ 20 ఏళ్లుగా సంస్థలో పనిచేస్తున్న మీటర్ రీడర్స్‌కు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, ఇతర సౌకర్యాలు లేకపోవడం శోచనీయమన్నారు. స్మార్ట్ మీటర్లు బిగింపుతో మీటర్‌రీడర్స్‌కు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందన్నారు. తక్షణమే వీరిఇక ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు ఏడాది గడిచినా .ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తమ సమస్యలను పరిష్కరించకపోవడం బాధాకరమన్నారు కార్యక్రమంలో పి తులసి,అప్పలకొండ చిరంజీవి ,శ్రీనివాసరావు, రమేష్, ఏఐటీయూసీ నాయకులు వి రాజు, కోరిబిల్లి శంకరారావు పాల్గొన్నారు.

81వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జిగా శివ

ప్రజాశక్తి-అనకాపల్లి : జివిఎంసి 81వ వార్డు వైసిపి ఇన్‌చార్జిగా బొడ్డేడ శివను అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలశాల భరత్ కుమార్ మరోసారి నియమించారు. ఈ సందర్భంగా బొడ్డేడ శివ ఆధ్వర్యంలో పట్టణంలో వంద బైక్ లతో బొడ్డేడ శివ ఇంటి నురచి పార్టీ పట్టణ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం భరత్ మాట్లాడుతూ ఎంతో మంది నాయకులు పార్టీని వీడినా, బొడ్డేడ శివ పార్టీపట్ల అంకితభావంతో ఉన్నారన్నారు. అనంతరం మలసాల భరత్, శివను గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బొడ్డేడ శివ మాట్లాడుతూ జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్ నాథ్, పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్, మలశాల భరత్ కుమార్ ఆశీస్సులతో తనను మళ్లీ వార్డు ఇన్‌చార్జిగా నియమించడంపై పార్టీ అధినేత జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి మలసాల కుమార రాజా, కొణతాల మురళి, సుంకర వెంకటేశ్వర రావు, ఆడారి బుచ్చి రాము, కాండ్రేగుల వెంకట సాంబ, పెంటకోట సంతోష్,రాపేటి మహాలక్ష్మీనాయుడు,మరిపల్లి శోభ, నీలకంఠ లక్ష్మీ, పద్మ, పిళ్లా గాంధీ, బొడ్డేడ నూక రాజు, బొడ్డేడ రాజేష్, బొడ్డేడ భాను..చిరంజీవి.. గొలగాం రాము పాల్గొన్నారు.

బొడ్డేడ శివను అభినందిస్తున్న భరత్, ఇతర నేతలు

ఎపి ఎన్‌జివోస్ జిల్లా నూతన కార్యవర్గం

ప్రజాశక్తి -అనకాపల్లి : ఎపి ఎన్‌జివోస్ అనకాపల్లి జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం ఏకగ్రీవంగా జరిగిందని యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం వెంకటేశ్వర్లు ప్రకటించారు. నామినేషన్ల చివరి తేదీ 29నాటికి ఒక్కో పోస్టుకు ఒక్కొక్క దరఖాస్తు దాఖలు కావడంతో 17 పోస్టులను ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించారు. జిల్లా అధ్యక్షులుగా పి సూర్యనారాయణ (కమర్షియల్ టాక్స్ సీనియర్ అసిస్టెంట్), అసోసియేట్ అధ్యక్షుడిగా పి దాలినాయుడు, ఉపాధ్యక్షులుగా ఎజె.సత్యనారాయణ, ఎం శ్రీనివాస్, డి ఆనందరావు, ఎస్ సత్యనారాయణ, విఎస్‌వి శ్రీనివాసరావు, పి రేవతి, కార్యదర్శిగా డి శేషు కుమార్(జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం), ఆర్గనైజింగ్ సెక్రటరీగా జీవి రమణబాబు, జాయింట్ సెక్రటరీలుగా సిహెచ్ బాబురావు, డి కొండలరావు, ఎస్ శ్రీనివాసరావు, కె కిరణ్ కుమార్, వి చిరంజీవి, జి సంతోషి కుమారి, కోశాధికారిగా పి త్రినాథ్ ఎన్నికైనట్టు ప్రకటించారు. ఎన్నికల అధికారిగా కోనసీమ ఎపిఎన్‌జివోస్ కార్యదర్శి అంబేద్కర్, అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా కెపివిఎన్‌బి.కృష్ణ, పరిశీలకునిగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి శ్రీనివాసులు వ్యవహరించారు.

మాట్లాడుతున్న ఎన్‌జివోస్ యూనియన్ నేత

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాదర్బార్‌లో సమస్యలు వింటున్న ఎమ్మెల్యే కొణతాల

ప్రజాశక్తి-కశింకోట : తన దృష్టికి వచ్చిన సమస్యలన్నీ నిబంధనలకు లోబడి శతశాతం పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. సోమవారం కశింకోట గ్రామంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజా దర్బార్‌లో 60శాతం రెవెన్యూ సమస్యలు వచ్చాయని, విఆర్‌ఒలు ఆయా సమస్యలను పరిశీలించి పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వైసిపి పాలనలో ప్రజాసమస్యలను పూర్తిగా గాలికొదిలేశారని, వాటన్నింటినీ గాడిలో పెట్టి పరిష్కరించడంతోపాటు అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని హామీనిచ్చారు. అర్హులకు పెన్షన్లు, ఇళ్లు, ఇతర సంక్షేమ పథకాలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో తహశీలా తిరుమలరావు, ఎంపిడిఒ చంద్రశేఖర్ రావు, సీఐ స్వామినాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కొణతాలకు ఆహ్వానం

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి సుంకరమెట్ట జంక్షన్ వద్ద వేంచేసిన సత్యనారాయణ సూర్యనారాయణ స్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా లక్ష పుష్పార్చన నిర్వహించనున్నట్టు ఆలయ ఛైర్మన్ బొడ్డేడ మురళి తెలిపారు. దీనికి సంబంధించి ఆహ్వానపత్రికను సోమవారం ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు అందజేశారు. ఉత్తర ద్వార దర్శనం, సత్యనారాయణ స్వామి వ్రతాలు, మధ్యాహ్నం అన్నసమారాధనలో పాల్గొనాలని ఎమ్మెల్యేను ఆహ్వానించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు కర్రీ లక్ష్మీ నూకరాజు, తురకలపూడి ఈశ్వరరావు, కసింకోట టిడిపి నాయకులు వేగి గోపికృష్ణ పాల్గొన్నారు.

ఎపిటిఎఫ్ నూతన జిల్లా కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-.అనకాపల్లి : అనకాపల్లిలో సచ్చిదానంద వజ్ర వేదికలో సోమవారం అనకాపల్లి జిల్లా ఎపిటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కె.కె.ఎల్.ఎన్. ధర్మారావు, అధ్యక్షునిగా వై. శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్. దుర్గాప్రసాద్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులు, పర్య వేక్షకులుగా యూనియన్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి. వెంకటపతి రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు తమరాన త్రినాథ్ వ్యవహరించారు.

వాహనాలపై ఎఎన్‌పిఆర్ నిఘా

ప్రజాశక్తి- సబ్బవరం : ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించేవారిపై ఎఎన్‌పిఆర్ సిసి కెమెరాల నిఘా ఉంటుందని సబ్బవరం సిఐ జి రామచంద్రరావు తెలిపారు రోడ్డుపై ప్రయాణించినప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే, పోలీసుల కళ్లగప్పి తప్పించుకున్నా, వాహనాల నెంబర్ ప్లేట్లను గుర్తించి ఆటోమెటిక్‌గా కేసులు నమోదు చేసే ఎఎన్‌పిఆర్ కెమెరాల నిఘా నుంచి తప్పించుకోలేరని హెచ్చరించారు. అనకాపల్లి జిల్లాలో ప్రమాదాలు నివారణకు, ట్రాఫిక్ నిబంధనలను పకడ్బందీగా అమలుకు జిల్లా పోలీస్ యంత్రాంగం జిల్లా కేంద్రంతోపాటు జిల్లాలో ఈ వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. పోలీసులున్నా, లేకపోయినా ఈ కెమెరాలు నిఘా వాహనాలపై అనునిత్యం ఉంటుందని వాహనదారులు గమనించాలని హెచ్చరించారు. సిగ్నల్ జంప్, ట్రిపుల్ రైడింగ్, నోపార్కింగ్‌లో వాహనాలను పెట్టడం, ఆటోల్లో ఓవర్‌లోడ్ ఇతరత్రా ఎటువంటి ట్రాఫిక్ ఉల్లంఘన చేసినా ఆటోమేటిక్‌గా చలానా నమోదౌతుందన్నారు.

బాల్యవివాహాల అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి- అనకాపల్లి : బాల్య వివాహ ముక్త భారత్ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం అనకాపల్లి భాష్యం స్కూల్లో జరిగింది. డిసిపియూ స్టాఫ్ ఫోనిక్ మనోహర్, ఎల్‌సిపిఒ కర్రి రమాదేవి, కౌన్సిలర్ భాను, రమ్య, ప్రిన్సిపాల్ రమణ, స్కూల్ స్టాఫ్, విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎల్‌సిపిఒ రమాదేవి మాట్లాడుతూ బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేయించారు.

కిక్ బాక్సింగ్ పోటీల్లో సత్తా

పతకాలను సాధించిన యలమంచిలి క్రీడాకారులు

ప్రజాశక్తి- యలమంచిలి టౌన్ : వేకో ఆంధ్రప్రదేశ్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో యలమంచిలి క్రీడాకారులు సత్తాచాటి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఆదివారం విశాఖపట్నంలో ఆంధ్ర యూనివర్సిటీ కిక్ బాక్సింగ్ క్లబ్‌లో నిర్వహించిన పోటీల్లో యలమంచిలి నుంచి నక్కా వెంకటరమణ ఆధ్వర్యంలో క్రీడాకారుల బృందం పాల్గొంది. వీరిలో పిబిఎస్ వర్షిణి, బి భార్గవ్, బి జ్యోతిష్ బంగారు పతకాలు సాధించగా, మనోజ్, వర్షిణి, జాశ్రీత్, కుషాలిని, అభిరామ్, జయదీప్ వెండి పతకాలను, మరో ఆరుగురు కాంస్య పతకాలను సాధించారు. పతక విజేతలను పలువురు అభినందించగా, తమపిల్లల క్రీడా ప్రతిభపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అంగన్వాడీ చిన్నారులకు డ్రాయింగ్ పోటీలు

ప్రజాశక్తి- మునగపాక: మండలంలోని మడకపాలెం అంగన్వాడి కేంద్రంలో సోమవారం కేంద్ర ప్రభుత్వ వీర్ బాల్ దివస్ ఉత్సాహంగా జరిగింది. అంగన్వాడీ కార్యకర్త కెఎంఎస్ జయలక్ష్మి ఆధ్వర్యంలో బాల, బాలికలు డ్రాయింగ్, ఇతర ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

స్పెషల్‌బ్రాంచ్ డిఎస్‌పిగా మోహన్

ఎస్‌పి సిన్హాకు పూలమొక్క అందిస్తున్న డిఎస్‌పి మోహన్

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పిగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన జిఆర్‌ఆర్.మోహన్ సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగాగా ఎస్పీకి ఆయన పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కొత్త డిఎస్‌పికి ఎస్‌పి సిన్హా తగు సూచనలు చేశారు. కాగా డిఎస్‌పి మోహన్‌కు గతంలో నర్సీపట్నం డివిజన్‌లో పనిచేసిన అనుభవం ఉంది.

టిడిపి జిల్లా ఉపాధ్యక్షునికి సత్కారం

తమరానను అభినందిస్తున్న పాల సంఘం అధ్యక్షులు

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట : తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షులుగా నియమితులైన తమరాన దాసును ఘనంగా సత్కరించారు. సోమవారం కోమండపూడిలో దాసును మండలంలోని పలు గ్రామాలకు చెందిన విశాఖ డెయిరీ పాల సంఘం అధ్యక్షులు సన్మానించారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్లు గేదెల సత్యనారాయణ, ముమ్మిన సూర్యనారాయణ, మండల టిడిపి మాజీ అధ్యక్షులు గోకవాడి కోటేశ్వరరావు, డొంకిన అప్పలనాయుడు సేనాపతి శ్రీనివాసరావు, పత్తి రామారావు, అప్పన తాతబాబు, ముమ్మిన నాగరాజు, నైదాన నానిబాబు పాల్గొన్నారు.

దళాయిపాలెం ప్రత్యేక పంచాయతీ ప్రతిపాదనపై

విభేదాలతో ముగిసిన గ్రామసభ

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని వాడచీపురుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని దళాయిపాలెం గ్రామాన్ని ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనపై సోమవారం వాడచీపురుపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. దళాయిపాలెం గ్రామ ప్రజల అభ్యర్థన మేరకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేయగా, వాడచీపురుపల్లి గ్రామంతో పాటు పరిసర ప్రాంతాలైన మొత్తం 11 శివారు గ్రామాల ప్రజలు గ్రామసభకు హాజరయ్యారు. దళాయిపాలెం గ్రామంలో మొత్తం 1333 మంది జనాభా ఉండగా, ఈ గ్రామానికి చెందిన 138 మంది ప్రజలు గ్రామసభలో పాల్గొన్నారు. ఇతర గ్రామాల నుంచి 23 మంది హాజరై, మొత్తంగా 161 మంది ప్రత్యేక గ్రామపంచాయతీ ఏర్పాటుకు అనుకూలంగా అభిప్రాయం వ్యక్తం చేశారు. అయితే, 7 గ్రామాల ప్రజలు ఈ ప్రతిపాదనకు పూర్తిగా వ్యతిరేకత వ్యక్తం చేయగా, మొత్తంగా 224 మంది ప్రజలు ప్రత్యేక గ్రామపంచాయతీ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఓటు వేశారు. ఈ ప్రత్యేక గ్రామసభకు మొత్తం 13 మంది వార్డు సభ్యులు హాజరుకాగా, వారిలో 11 మంది దళాయిపాలెం ప్రత్యేక గ్రామపంచాయతీ ఏర్పాటు ప్రతిపాదనకు వ్యతిరేకంగా అభిప్రాయం వ్యక్తం చేశారు. కేవలం ఇద్దరు వార్డు సభ్యులు మాత్రమే అనుకూలంగా ఓటు వేశారు. ఈ సమావేశానికి డిప్యూటీ ఎంపిడిఒ మల్లికార్జునరావు, వాడచీపురుపల్లి సర్పంచ్ శివలంక లక్ష్మీ, మాజీ ఎంపిపి మాసవరపు అప్పలనాయుడు, వార్డు సభ్యులు, కూటమి నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

గ్రామసభలో మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపిడిఒ

ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలని ఆందోళన

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని జి. సింగవరం గ్రామస్తులు తమకు ప్రత్యేక పంచాయతీ కావాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. జి. భీమవరం పంచాయతీలో ఉన్న సింగవరం గ్రామాన్ని వేరుచేసి, ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు కొండ్ర శ్రీను, కిల్లాడ నాగేశ్వరరావు, సారిపిల్లి సత్తి బాబు, గార లోవ అప్పారావు, సారిపిల్లి నాని బాబు, చందనాడ బాబ్జీ, చందనాడ సత్తి బాబు పాల్గొన్నారు.

సమస్యలపై 'పల్లా'కు వినతి

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్ : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును గాజువాక క్యాంపు కార్యాలయంలో రాంబిల్లి మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు వసంతవాడ దిన్ బాబు ఆధ్వర్యంలో మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ సమస్యలను విన్నవించారు. దీనిపై పల్లా శ్రీనివాస్ సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని పార్టీ నేతలు తెలిపారు.

పల్లాను అభినందిస్తున్న టిడిపి నేతలు

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి -కశింకోట : అనకాపల్లి జిల్లా ఎపిటిఎఫ్ ఉపాధ్యక్షులుగా ఎన్నికైన పి.గణపతిని కసింకోట కశింకోట మండల యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె సూర్యనారాయణ, పిఎం అప్పారావు సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా గణపతి మాట్లాడుతూ విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

రికార్డుల నిర్వహణ బాధ్యత కార్యదర్శులదే

ప్రజాశక్తి -యస్ రాయవరం.: మండలంలోని దార్లపూడి గ్రామంలో సోమవారం డిప్యూటీ ఎంపిడిఒ బంగారు సత్యనారాయణ పర్యటించారు. పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పంచాయతీ కార్యదర్శులందరూ తప్పనిసరిగా రికార్డులను తప్పనిసరిగా నిర్వహించాలని రికార్డుల నిర్వహణలో ఎలాంటి లోపాలు ఉన్నా, సంబంధిత కార్యదర్శులదే బాధ్యత వహించాలన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలు మేరకు పంచాయతీలలో నిధుల వినియోగం జరగాలన్నారు

విద్యాసమస్యల పరిష్కారానికి ఆందోళన

ప్రజాశక్తి-. అనకాపల్లి : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, రాష్ట్రంలో విద్యావ్యవస్థను కూటమి ప్రభుత్వం గాలికొదిలేసిందని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వలరాజు, బందెల నాసరజీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాయికుమార్ మండిపడ్డారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియం రోడ్డు వద్ద సోమవారం బహిరంగ సభ నిర్వహించారు. ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు పి బాబ్జి అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య నాయకులు రాజాన దొరబాబు, జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్రకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాసరజీ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అనేక హామీలను అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ ఒక్క వాగ్దానాన్ని నిలుపుకోలేదని మండిపడ్డారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ. 6400 కోట్లు వంద రోజుల్లో విడుదల చేస్తామని హామీ ఇచ్చి అటకెక్కించారన్నారు. ప్రభుత్వ వైద్యకళాశాలలను పిపిపి విధానంలో ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కు

అభివాదం చేస్తున్న నాయకులు

తీసుకోవాలన్నారు.. ఉన్నత విద్యను దూరం చేసే జిఒ 77 రద్దుహామీ అమలు చేయలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జూనియర్, డిగ్రీ కళాశాలలు, వర్సిటీల్లో ఖాళీ బోధన సిబ్బంది పోస్టుల భర్తీ, విద్యాలయాలు, హాస్టల్లో మౌలిక వసతులు కల్పించడం లేదని, విదేశాల తిరుగుతూ విద్యారంగాన్ని పూర్తిగా నీరుగారిస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థులతో పెట్టుకుంటే ప్రభుత్వాలు కూలిపోయిన చరిత్ర ఉందని, వైసిపికి పట్టిన గతే తప్పదని హెచ్చరించారు.కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ నాయకులు జగదీష్, ఏసుబాబు, వెంకటేష్ పాల్గొన్నారు.

అందుబాటులో సరిపడా యూరియా

ప్రజాశక్తి -యలమంచిలి టౌన్ : యలమంచిలి సబ్ డివిజన్ పరిధిలోని అచ్యుతాపురం, యలమంచిలి, రాంబిల్లి, ఎస్ రాయవరంలో ప్రస్తుత రబీ సీజన్‌లో రెండు వేల టన్నులు యూరియా అవసరం కాగా, ఇప్పటికే 1856 టన్నులు యూరియా సరఫరా చేశామని వ్యవసాయశాఖ ఎడి సుమంత తెలిపారు. అన్ని రైతు సేవా కేంద్రాలు, పిఎసిఎల్‌లు, ప్రైవేటు డీలర్ల వద్ద యూరియా అందుబాటులో ఉందని. రైతులు వినియోగించు కోవాలన్నారు. నూతనంగా నానో యూరియా, నానో డిఎపి ఎరువులను కూడా అందుబాటులో ఉంచామన్నారు. యూరియా, ఇతర ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే ప్రైవేటు డీలర్ల లైసెన్స్ రద్దు చేస్తామని,ఎరువుల నియంత్రణ చట్టం 1985 ప్రకారం వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యస్ రాయవరం: ప్రస్తుత రబీ సీజన్‌లో వరి, అపరాలు, కూరగాయల పంటలు సాగుచేస్తున్న రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి సౌజన్య తెలిపారు. మండల పరిధిలో ప్రైవేటు డీలర్లతోపాటు పిఎసిఎస్‌లు, రైతుసేవా కేంద్రాల ద్వారా సరఫరాకు 15 టన్నుల యూరియా సిద్ధంగా ఉండగా, మరో 24 టన్నులు మంగళవారంకోరుప్రోలు పిఎసిఎస్‌కు రానుందని తెలిపారు.

కె.కోటపాడు: రబీ సాగుకు అవసరమైన యూరియా అందుబాటులో తీసుకువస్తున్నామని మండల వ్యవసాయాధికారి సోమ్‌శేఖర్ తెలిపారు. ఇప్పటివరకు కె కోటపాడు మండలానికి 990 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామని, మరో 48 మెట్రిక్ టన్నుల యూరియా ఒకటి రెండు రోజులలో చోడువాడ , కె కోటపాడు పిఎసిఎస్‌లకు రానుందని తెలిపారు. మండలంలో ఇప్పటివరకు 2950 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేసి, డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. రబీ సీజన్‌కు డిజిటల్ ఇక్రాప్ మొదలు పెట్టామని, రైతులు తమ పంట వివరాలను నమోదు చేసుకోవాలన్నారు.

గొలుగొండ:రైతులకు అవసరమైన యూరియా రైతు సేవా కేంద్రాలు, రిటైల్ అవుట్ లెట్లలో అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి కే.సుధారాణి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రైతు సేవా కేంద్రాల్లో 12 మెట్రిక్ టన్నులు, డీలర్ల వద్ద 67 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని చెప్పారు. వరి కోతల అనంతరం పశుగ్రాసం, ఉద్యాన పంటలు, కూరగాయల సాగుకు యూరియా వినియోగం జరుగుతుందని చెప్పారు.

4న మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : వచ్చే నెల 4న అనకాపల్లి మండల 19వ మండల సాధారణ సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపిపి సూరి బాబు తెలిపారు. అన్నిశాఖల అధికారులు, మండల ప్రజా ప్రతినిధులు తప్పక పాల్గొనాలని కోరారు

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-దేవరాపల్లి: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండడంతో పాటు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని కె.కోటపాడు సిఐ పి. పైడపు నాయుడు అన్నారు. సోమవారం దేవరాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు డ్రగ్స్ అనర్థాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి, చక్కగా చదువుకొని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. వ్యక్తిగతంగా అభివృద్ధి చెందడంతోపాటు పాఠశాలకు, తల్లిదండ్రులకు, ఈ ప్రాంతానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్ఐలు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్ వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి -సబ్బవరం : సోలార్ విద్యుత్ వినియోగంతో విద్యుత్ బిల్లుల భారం తగ్గించుకోవచ్చని ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ విభాగం ఇఇ ఎస్.రామకృష్ణ అన్నారు. సోమవారం సబ్బవరం మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంపై అవగాహన సదస్సులో మాట్లాడుతూ, సోలార్ విద్యుత్తు యూనిట్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం రాయితీ ఇస్తుందని, దాన్ని సద్వినియోగం చేసుకుని ఆసక్తి ఉన్నవారంతా రూఫ్‌టాప్ సోలార్ పథకాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విద్యుత్ అంతరాయ సమస్యలకు చెక్‌పెట్టడంతోపాటు బిల్లుల భారం తగ్గుతుందన్నారు. సబ్బవరం సెక్షన్ కార్యాలయం ఎడిఇ సురేష్, ఎఇలు దుర్గాప్రసాద్, నాయుడు, సర్పంచ్ డి.ప్రసాదరావు, ఉపసర్పంచ్ మండల లక్ష్మణ్, వార్డు సభ్యులు పల్లా తాతారావు, కొల్లి కృష్ణ పాల్గొన్నారు.

సిపిఎం నేతల అరెస్టులపై నిరసనలు

దేవరాపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి- దేవరాపల్లి : సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజుపై పెట్టిన పిడియాక్ట్‌కు వ్యతిరేకంగా, నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల బంద్ సందర్భంగా సిపిఎం నేతల అరెస్ట్‌ను నిరసిస్తూ సోమవారం సిపిఎం దేవరాపల్లి మండల కార్యదర్శి బిటి. దొర ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బిటి.దొర మాట్లాడుతూ సోమవారం బంద్ సందర్భంగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న, గనిశెట్టి సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు , జిల్లా కమిటీ సభ్యులు దేవుడు నాయుడు తదితరులను ఆరెస్ట్ చేయడం దుర్మార్గమని ఖండించారు. అప్పలరాజుపై పీడీ యాక్ట్ తొలగింపుతోపాటు అరెస్టు చేసిన నాయకుల ందరినీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో బలిజ నాగేశ్వరరావు, కాదల రాము, పంది మహాలక్ష్మి నాయుడు,పంది రాజు పాల్గొన్నారు.

యలమంచిలి టౌన్ : సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం అప్పలరాజుపై పిడి యాక్ట్ పెట్టి అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం బంద్ పాటిస్తున్న ఆ పార్టీ నేతలను అరెస్ట్ చేయడం దుర్మార్గమని సిఐటియు జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ సత్తిబాబు అన్నారు. సోమవారం అచ్చుతాపురంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో డి అప్పలనాయుడు, ఆర్ ఒన్మలనాయుడు, ఎల్ రాము నాయుడు, ఆర్ అప్పలకొండ, అప్పలనాయుడు పాల్గొన్నారు.

నర్సీపట్నం రూరల్:సీపీఎం నాయుకులు అక్రమ అరెస్టులను ఖండిస్తూ నర్సీపట్నం కృష్ణాబజారులో సీపీఎం ఆధ్వర్యంలో నల్ల రిబ్బన్లతో సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు మాట్లాడుతూ, సిపిఎం నాయకులు అప్పలరాజుపై పెట్టిన పిడి యాక్టును రద్దు చేయాలని ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాల్లో శాంతియుతంగా తలపెట్టిన బంద్‌ను పోలీసులు అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నక్కపల్లి పరిసర ప్రాంతంలో రైతులు, కార్మికుల పక్షాన పోరాడుతున్న అప్పలరాజుపై తప్పుడు కేసులు బనాయించడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నానాజీ, రమణ, గంగ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో నాయకుల నిరసన

నక్కపల్లి:సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజుపై పీడీ యాక్ట్‌ని నిరసిస్తూ చేపట్టిన బంద్‌కు వెళ్ళనివ్వకుండా అడ్డుకోవడం దుర్మార్గమైన చర్యని సిపిఎం మండల కార్యవర్గ సభ్యులు ఎం మహేష్ బాబు అన్నారు. తనతో పాటు కాశీ రావు, సోమేష్‌ను నక్కపల్లి బంద్‌లో పాల్గొనకుండా గృహ నిర్బంధం చేశారని, పలువురు మత్స్యకారులు నక్కపల్లి వెళుతుండగా పోలీసులు అడ్డుకున్నారని, బెదిరింపు చర్యలతో పోలీసులు ప్రజా హక్కులను కాల రాస్తున్నారని అన్నారు. బంద్ లో పాల్గొనకుండా పోలీసులు అడ్డగించడానికి నిరసిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు కాళ్ళ దేముడు, బొంది నూకమ్మ, జి.సత్యవతి, లక్ష్మి, కామేశ్వరి, పి.రాము, కె.కాశీరావు, నూకమ్మ చిట్టెమ్మ పాల్గొన్నారు.

రాజయ్యపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న నేతలు, మహిళలు

నర్సీపట్నంలో నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నేతలు

చోడవరం : సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజుపై పిడి యాక్ట్ పెట్టి అరెస్టు చేయడం దుర్మార్గమని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు గూనూరు వరలక్ష్మి అన్నారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడే సిపిఎం నేతలపై అన్యాయంగా ఇలాంటి కేసులు పెట్టి జైలు పాల్జేయడం దుర్మార్గమన్నారు. అప్పలరాజు అరెస్ట్‌ను వ్యతిరేకిస్తూ నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లో బంద్‌కు పిలుపునిచ్చి నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నేతలను అరెస్ట్ చేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో ఉమా, సత్యవతి బుచ్చి, రాజమ్మ, దేవుడమ్మ, పార్వతి, మణి, రాజులమ్మ పాల్గొన్నారు.

అప్పలరాజు కుటుంబానికి వైసిపి నేతల పరామర్శ

ప్రజాశక్తి-యస్ రాయవరం : పిడి యాక్ట్ పెట్టి అరెస్ట్ చేసిన సిపిఎం నాయకుడు అప్పలరాజు కుటుంబాన్ని సోమవారం వైసిపి నాయకులు పరామర్శించారు. పాయకరావుపేట నియోజకవర్గ వైసిపి ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, ఇతర నేతలు అప్పలరాజు కుటుంబసభ్యులను పరామర్శించి వైసిపి తరపున అండగా ఉంటామని భరోసానిచ్చారు.కార్యక్రమంలో యస్ రాయవరం మండల పార్టీ అధ్యక్షులు ఎస్ఎఎన్ మధు వర్మ, ధర్మవరం మాజీ సర్పంచ్ వెదుళ్ల బంగారి, మైలపల్లి రాజారావు, వైస్ ఎంపిపిచోడిపల్లి అప్పన్న, కర్రి శ్రీనుబాబు, పోలిశెట్టి శ్రీను పాల్గొన్నారు.

పోలీసుల దమనకాండను ఖండించండి

అనకాపల్లి :సిపిఎం నాయకులు ఎం.అప్పలరాజుపై అక్రమంగా పీడీ యాక్ట్ పెట్టి అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాల్లో పిలుపునిచ్చిన శాంతియుత బంద్‌ను ప్రభుత్వం పోలీస్ బలగాలతో అణిచివేయడానికి చేసిన ప్రయత్నాలను సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోంది. సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు విడుదల చేసిన ప్రకటనలో బంద్‌ను విఫలం చేయాలనే ఉద్దేశంతో సోమవారం తెల్లవారుజాము నుంచే పోలీసులు. అప్పలరాజు స్వగ్రామం ధర్మవరం సహా పలు గ్రామాల్లో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ బయటకు రాకుండా అడ్డుకోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. . రాజయ్యపేటలో సిపిఎం నాయకులు మహేష్ తదితరులను గృహ నిర్బంధం, నక్కపల్లి అడ్డరోడ్డు జంక్షన్ వద్ద ప్రతి షాప్‌కు వెళ్లి బంద్‌కు సహకరించొద్దని షాపు యజమానులను బెదిరించడం, విద్యాసంస్థలు తప్పనిసరిగా నడపాలని అధికారుల ద్వారా ఫోను చేసి నిర్బంధం ప్రయోగించడం దుర్మార్గమన్నారు

విశాఖపట్నం : ప్రజాస్వామ్య ఉద్యమాలపై పోలీసుల దమనకాండ, ప్రభుత్వ నిర్బంధాన్ని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఒక ప్రకటనలో ఖండించారు. ప్రజా సమస్యలపై నిరసన వ్యక్తపరచే రాజ్యాంగబద్ధమైన హక్కును కాలరాస్తూ అక్రమ అరెస్టులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికి తీరని నష్టమన్నారు..ఎం.అప్పలరాజుపై పెట్టిన పీడీ యాక్ట్‌ను వెంటనే రద్దు చేసి విడుదల చేయాలని డిమాండ్ చేశారు.బంద్ నేపథ్యంలో సిపిఎం ముఖ్యనేతలను అరెస్ట్ చేయడంతోపాటు సామాన్యప్రజలు, వ్యాపారులు, విద్యాసంస్థలను భయభ్రాంతులకు గురిచేసి బంద్ విఫలానికి పోలీసుల ద్వారా ప్రభుత్వ చర్యలు దుర్గార్మమన్నారు.

అరెస్టులు అన్యాయం : సిపిఐ

పాయకరావుపేట : సిపిఎం నేత అప్పలరాజును పిడి.చట్టం ఉపయోగించి అరెస్టు చేయడమే అప్రజాస్వామికమైతే, దాన్ని వ్యతిరేకిస్తూ చేపట్టే బంద్‌లో వామపక్ష పార్టీల నేతల ముందస్తు అరెస్ట్‌లు అన్యాయమనిసిపిఐ పాయకరావుపేట మండల కార్యదర్శి వెలుగుల అర్జునరావు విమర్శించారు. సోమవారం ఎస్.రాయవరం, నక్కపల్లి మండలాలు బంద్‌కు సంఘీభావం తెలిపేందుకు వెళ్తున్న తనను పాయకరావుపేట పోలీసులు ముందస్తు అరెస్టు చేయడాన్ని ఖండించారు. మహిళా సమాఖ్య అనకాపల్లి జిల్లా కార్యదర్శి బూసి పరమేశ్వరిని హౌస్ అరెస్టు చేయడాన్ని ఖండించారు.

రెవెన్యూ డివిజన్ కేంద్రంగా

అడ్డురోడ్డు ఆమోదంపై అనిత కృతజ్ఞతలు

ప్రజాశక్తి-నక్కపల్లి:పాయకరావుపేట నియోజక వర్గం యస్.రాయవరం మండలం అడ్డురోడ్డు కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయడానికి, అమరావతిలో సోమవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఆమోదం లభించింది. పారిశ్రామికంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పాయకరావుపేట నియోజకవర్గానికి ఇది కీలక నిర్ణయంగా నిలవనుందని, అడ్డురోడ్డు కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కావడంతో పరిసర ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందుతాయని హోం మంత్రి వంగలపూడి అనిత ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హోం మంత్రి వంగలపూడి అనిత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపినట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి- దేవరాపల్లి : గ్రామాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ప్రజలు ఆరోగ్యవంతంగా ఉంటారని ఎం.అలమండ సర్పంచ్ దాడి జగన్నాథరావు (జగన్) అన్నారు. సోమవారం గ్రామంలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించి డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తను పారిశుధ్య సిబ్బంది, ప్రైవేట్ వర్కర్లతో తొలగించారు. మురుగునీరు నిల్వలు లేకుండా చర్యలు తీసుకున్నారు. గ్రామంలోని వీధులన్నీ శుభ్రపరిచి, రోడ్లకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. చెత్త రహిత గ్రామంగా తీర్చిదిద్దడానికి గ్రామస్తులు సహకరించాలని సర్పంచ్ జగన్ కోరారు.

వెంకన్న తిరువీధి సేవ

ప్రజాశక్తి-నక్కపల్లి:ఉపమాక వెంకన్న ఆలయంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీనివాసుడు సప్పరం వాహనంపై పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. వెంకన్న ఉత్సవమూర్తులను సప్పరం వాహనం , గోదాదేవి అమ్మవారి ఉత్సవ మూర్తిని మాడవీధుల్లో తిరువీధి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వర ప్రసాదాచార్యులు, అర్చకులు శేషాచార్యులు, గోపాలాచార్యులు పవన్, ఆలయ ఇన్ స్పెక్టర్ కూర్మేశ్వరరావు పాల్గొన్నారు.

ఊరేగిస్తున్న అర్చకులు

ఒడ్డుకు కొట్టుకొచ్చిన బోటు

తీరానికి కొట్టుకొచ్చిన బోటు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేట పంచాయతీ బోయపాడు సముద్ర తీరానికి బోటు కొట్టుకు రావడంతో స్థానిక మత్స్యకారులు మెరైన్ పోలీసులకు సోమవారం సమాచారం అందజేశారు. ఈ మేరకు మెరైన్ పోలీసులు వచ్చి బోటును పరిశీలించారు. ఎటువంటి అనుమానస్పాద వస్తువులు లేవని వెల్లడించారు. ఆదివారం రాత్రి రెండు బోట్లు దొంగతనం జరిగినట్లుగా ఫిర్యాదు అందిందన్నారు.

పుస్తకాలు పంపిణీ చేస్తున్న సిఐ, ,నాయకులు

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-నర్సీపట్నం రూరల్:స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(మెయిన్)లో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్, బీసీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రాజాన వీర సూర్యచంద్ర నేతృత్వంలో సోమవారం స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నర్సీపట్నం టౌన్ సీఐ షేక్ గఫూర్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్ అందజేయడం అభినందనీయమన్నారుఎంఈఓ తలుపులు మాట్లాడుతూ, సామాజిక బాధ్యతతో ముందుకు రావడం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా సెక్రటరీలు అల్లాడ సురేష్, పంచాడ హరినాథ్, గొలుగొండ మండల జనసేన పార్టీ అధ్యక్షులు గండెం దొరబాబు, లీగర్ సెల్ అలివేలు మంగ పాల్గొన్నారు.

ఎన్నికైన కమిటీ సభ్యులు

జనసేన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-చీడికాడ:జనసేన మండల పార్టీ అధ్యక్షులు జీ వి మూర్తి ఆధ్వర్యంలో గ్రామంలో ఆ పార్టీ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. మండలంలోని అడవి అగ్రహారం గ్రామంలో జనసేన పార్టీ కార్యకర్తలకు ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు మూర్తి సమక్షంలో అడవి అగ్రహారం గ్రామంలో సమావేశం ఏర్పాటు చేశారు. జనసేన పార్టీ గ్రామ అధ్యక్షుడిగా పడాల కొండలరావును, ప్రధాన కార్యదర్శిగా గంటా రాము, కార్యదర్శులుగా ధారబోయిన గణేష్, దాలి బోయిన మారయ్య, నాగులపల్లి మణికంఠ, మైచర్ల చిన్న ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ జనసేన నాయకులు, బైలపూడి ఉపసర్పంచ్ గుమ్మడి సంతోష్ పాల్గొన్నారు.

31న పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-గొలుగొండ:ఈ నెల 31న పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గొలుగొండ ఇన్‌ఛార్జ్ ఎంపిడిఓ ఉలబాల శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్తగా 17 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. అర్హులైన లబ్ధిదారులందరికి బుధవారం ఉదయం నుంచే పింఛన్లను పంపిణీ చేస్తామని తెలిపారు.

కృష్ణవేణిని అభినందిస్తున్న స్పీకర్

బాక్సర్ కృష్ణవేణికి స్పీకర్ అభినందనలు

ప్రజాశక్తి-నర్సీపట్నంరూరల్: నేషనల్ బాక్సర్ కే.కృష్ణవేణి బాక్సింగ్ కోచ్‌గా ఉద్యోగం సాధించిన నేపథ్యంలో సోమవారం స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అభినందించారు. సోమవారం కృష్ణవేణి స్పీకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కృష్ణవేణి నర్సీపట్నం ప్రభుత్వ బాలికల పాఠశాల, కళాశాలలో చదువుకని ఇక్కడే బాక్సింగ్‌ను ప్రారంభించి ఎన్నో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించి ఖేలో ఇండియా బాక్సింగ్ కోచ్‌గా ఉద్యోగం సాధించినందుకు గాను స్పీకర్ ప్రత్యేకంగా అభినందించారు. బాక్సింగ్ కోచ్‌గా విద్యార్థులకు మంచి శిక్షణ ఇచ్చి నేషనల్ స్థాయికి తీసుకువెళ్లాలని సూచించారు. కృష్ణవేణిని మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ గొలుసు నరసింహమూర్తి, టీడీపీ నాయకులు గుడిబండ నాగేశ్వరరావు (జీఎన్ఆర్)లు అభినందించారు.

కలిసిన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి -మాడుగుల: మండలంలోని తాటిపర్తి ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 1993- 2003 మధ్యలో చదివిన పూర్వ విద్యార్థులు తాటిపర్తి శివారు గరికిబంద బిళ్లలపాలెం వెళ్లే మార్గం పల్నాటి సత్యనారాయణ టేకు వనంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్వవిద్యార్థులు మాట్లాడుతూ, పలు రంగాల్లో స్థిరపడి బిజీగా ఉన్నా అంతా ఒకే వేదికపై కలవడం ఆనందదాయ కమన్నారు.అనంతరం ఆనాటి ఉపాధ్యాయులను సత్కరించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. గురువులతో కలిసి విద్యార్థులంతా వనభోజనాలు చేసి ఉల్లాసంగా గడిపారు.

మాట్లాడుతున్న ఎఒ

రైతుల నుంచి ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి-రోలుగుంట: ఈ ఏడాది ఖరీఫ్‌లో 5800 ఎకరాల్లో వరి వేయడం జరిగిందని, ఎకరాకు 20 నుండి 25 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని మండల వ్యవసాయాధికారి చిరంజీవి అన్నారు. సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సచివాలయ వ్యవసాయాధికారులతో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రబీ సీజన్‌లో నువ్వుల పంట 100 ఎకరాల్లో వేయుటకు విత్తనాలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. విత్తనాలు వైఎల్ఆర్ 66, వైఎల్ఆర్ 146 ఈ రెండు రకాలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ రకమైన నువ్వులు విత్తనాలు ఎకరాకు 5,6 బస్తాలు దిగుబడి వస్తుందన్నారు. రైతు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నామన్నారు. రైతులకు 48 గంటల్లో అకౌంట్లలో డబ్బులు జమ అవుతుందన్నారు.

సిఐటియు మహాసభపై ముమ్మర ప్రచారం

సిఐటియు అఖిల భారత మహాసభ ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకూ విశాఖలో జరుగనున్న నేపథ్యంలో సోమవారం ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రచారం ముమ్మరంగా సాగింది. గాజువాక, మల్కాపురం, కొమ్మాదిలో ప్రచారం నిర్వహించారు.

కొమ్మాదిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

గాజువాకలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి-కొమ్మాది : సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదంచేయాలని కోరుతూ యూనియన్ మధురవాడ జోన్ కమిటీ ఆధ్వర్యాన విశాఖ పరిధి కొమ్మాది కూడలి, శివశక్తినగర్ రహదారిలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కొమ్మాది కూడలి శివశక్తినగర్ రహదారిలో ప్రారంభమైన ర్యాలీ మధురవాడ, చంద్రంపాలెం, మిథిలాపురి వుడా కాలనీ, కార్ షెడ్, పిఎం.పాలెం మీదుగా కొమ్మాది త్రిశక్తి దేవాలయాల వరకు సాగింది. ఈ సందర్భంగా సిఐటియు మధురవాడ జోన్ అధ్యక్షులు డి.అప్పలరాజు మాట్లాడుతూ, కార్మికులు, శ్రామికులు చెమటను చిందించి సంపద సృష్టిస్తే ఆ సంపదను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గుత్త పెట్టుబడిదారులకు దోచి పెడుతున్నాయని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు కార్పొరేట్ శక్తులకు అప్పగించి సామాన్యుల గొంతు కోస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు ఉన్న చట్టాలను తొలగించి, గుత్త పెట్టుబడిదారులకు బానిసలుగా మార్చుదానికి లేబర్ కోడ్స్ తీసుకొచ్చారని విమర్శించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు మహాసభలో భవిష్యత్తు పోరాటాలకు రూపకల్పన జరుగుతుందని చెప్పారు. జనవరి 4వ తేదీన జరిగే భారీ ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.రాజ్‌కుమార్, ఎస్.రామప్పడు, జి.కిరణ్, సిహెచ్.శేషుబాబు, కె.సురేష్, కె.కామేష్, బి.అప్పారావు, పి.వరలక్ష్మి, వి.గోవింద, ఆర్.రవి తదితరులు పాల్గొన్నారు.

గాజువాకలో పోస్టర్ ఆవిష్కరణ

గాజువాక : మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ గాజువాక సిఐటియు కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు సోమవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ సంపదను ఆదాని, అంబానికి కట్టబెడుతూ, దరిద్రాన్ని ప్రజలకు అంటగడుతున్నారని విమర్శించారు. ప్రజలు, కార్మికులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారాలు మోపి తీరని ద్రోహం చేస్తున్నాయని విమర్శించారు. లేబర్ కోడ్స్ పేరుతో కార్మికులను కట్టుబానిసలుగా చేస్తున్నారన్నారు. మున్సిపల్ రంగంలో కార్మికులను వర్క్ అవుట్ సోర్సింగ్ పేరుతో దళారులకు కట్టబె ముఖ్యమంత్రి చంద్రబాబు చూస్తున్నారని తెలిపారు. ఈ కుట్రలను ఆపకపోతే మున్సిపల్ కార్మికులు మరో ఆందోళనకు సిద్ధమవుతారని స్పష్టంచేశారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో సిఐటియు నాయకులు

కాకరలోవలో బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న బిఎస్ఎన్.రాజు, లక్ష్మణమూర్తి

ఎం.రాంబాబు, గొలగాని అప్పారావు, గణేష్, కెవి.రమణ పాల్గొన్నారు.

కాకరలోవలో బైక్ ర్యాలీ

ములగాడ : సిఐటియు మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యాన జివిఎంసి 63వ వార్డు పరిధి కాకరలోవలో బైక్ ర్యాలీని సిఐటియు జోన్ అధ్యక్ష కార్యదర్శులు బిఎస్ఎన్.రాజు, ఆర్.లక్ష్మణమూర్తి జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ చింతల్లోవ, క్రాంతినగర్, త్రినాధపురం, దుర్గానగర్, టిడిపి కాలనీ, జనతా కాలనీ, ఇందిరా కాలనీ, ఎక్స్‌సర్వీస్ మెన్ కాలనీ, ములగాడ హౌసింగ్ కాలనీ, హనుమాన్ నగర్, నెహ్రూ నగర్, కోరమండల్ గేట్, శ్రీహరిపురం మీదుగా మల్కాపురం వరకు సాగింది. ఈ సందర్భంగా జోన్ కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ, ఈనెల 31 నుండి జనవరి 4వ తేదీ వరకు జరిగే సిఐటియు 18వ అఖిలభారత మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జనవరి 4వ తేదీన విశాఖ ఆర్‌టిసి కాంప్లెక్స్ నుండి జివిఎంసి మున్సిపల్ స్టేడియం వరకు జరిగే భారీ ర్యాలీ, బహిరంగ సభలో కార్మికులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ ర్యాలీలో సిఐటియు జోన్ నాయకులు ఎం.శ్రీనివాసరావు, జి.నరేష్, ఎస్.వాసు, బి.శ్రీను, ఏసుబాబు, పివి.భాస్కరరావు, గంట సత్యనారాయణ, పి.సురేష్, రాజేష్, సుభాని, రాజు, నీలయ్య, నాగేశ్వరరావు, సత్యారావు, హెచ్‌పిసిఎల్ కాంటాక్ట్ వర్కర్లు, భవన నిర్మాణ కార్మికులు, ముఠా కార్మికులు, జివిఎంసి కార్మికులు పాల్గొన్నారు.

రసాభాసగా మున్సిపల్ సమావేశం

ప్రజాశక్తి-నర్సీపట్నం రూరల్: నర్సీపట్నం మున్సిపల్ బడ్జెట్, సాధారణ సమావేశం సోమవారం మున్సిపల్ ఛైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మీ అధ్యక్షతన జరిగింది. 2026-2027 నూతన బడ్జెట్‌లో కాంట్రాక్ట్ పనులు అన్ని కూటమి పార్టీ నాయకులకే కేటాయించారని, పట్టణంలో అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తున్నారని వైసీపీ కౌన్సిలర్లు ఆరోపించడంతో ఘర్షణ మొదలైంది. దీంతో టీడీపీ కౌన్సిలర్లు వైసీపీ హయాంలోనే అభివృద్ధి కుంటిపడిందని, అక్రమ కట్టడాలు ప్రోత్సహించారని చెప్పడంతో వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి మాట్లాడుతూ, 2026-27 బడ్జెట్ అంచనాలు సామాన్య ప్రజలకు కూడా అర్థమయ్యే రీతిలో ఉన్నాయని చెప్పారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 3 బడ్జెట్లు మాత్రమే ప్రవేశపెట్టిందని, అందులో కూడా అంకెల గారడీ ఉండేదని, కూటమి ప్రభుత్వం వచ్చాక పారదర్శకత బడ్జెట్‌ను ఇస్తున్నామని చెప్పారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు చొరవతో విఎంఆర్‌డిఎ నుండి రూ.4.11కోట్లు తీసుకురావడం జరిగిందన్నారు. మొత్తం రూ.9.11కోట్ల విఎంఆర్‌డిఎ నిధులతో 107 పనులు చేపట్టామన్నారు.

టీడీపీ కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధు మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రతిపక్ష నాయకులు ఉద్దేశ్యపూర్వకంగా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర పాల్గొన్నారు.

వాగ్వివాదం పడుతున్న సభ్యులు

రెవెన్యూ క్లినిక్ ద్వారా భూసమస్యల పరిష్కారం

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి- అనకాపల్లి : భూ సంబంధిత సమస్యలను రెవిన్యూ క్లినిక్ ద్వారా సత్వరమే పరిష్కరించనున్నట్లు జిల్లా కలెక్టరు విజయకృష్ణన్ తెలిపారు. సోమవారం కలెక్టరు కార్యాలయంలో పిజిఆర్ఎస్‌లో జిల్లా కలెక్టరు విజయకృష్ణన్, డిఆర్ఒ వై. సత్యనారాయణరావు పాల్గొని అర్జీలు స్వీకరించారు. అర్జీలపై సంబంధిత అదికారులను వివరాలు అడిగి తెలుసుకొని, పరిష్కార చర్యలకు ఆదేశించారు. సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిశీలించి, పరిష్కరించాలని సూచించారు. అనకాపల్లి కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 410 అర్జీలు వచ్చాయి. రెవెన్యూకు సంబంధించి 222, ఎలిమినేషన్ ఆఫ్ పవర్టి 45, పంచాయతీరాజ్ 27, సర్వే సెటిల్మెంట్ ల్యాండ్స్ రికార్డ్స్ 15, ఆర్డబ్ల్యూఎస్ 15, పోలీస్ 13 విద్యుత్ శాఖ12 ఫిర్యాదులు ఉన్నాయి.

ఇవిఎం గోదాము తనిఖీ

అనకాపల్లి : జిల్లా ఎస్‌పి. కార్యాలయం ప్రాంగణంలో ఉన్న ఇవిఎం గొడౌనును సోమవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టరు విజయకృష్ణన్ తనిఖీచేసారు. గొడౌనులో భద్రపరచిన ఇవిఎం యంత్రాలు సి.సి. కెమెరాలు, అగ్నిమాపక పరికరాలను, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. కార్యకమంలో డిఆర్ఒ వై.సత్యనారాయణ రావు, ఎలక్షన్ సెక్టను సూపరింటెండెంటు ఎస్ఎస్‌వి.నాయుడు, టిడిపి ప్రతినిధి బి. శ్రీనివాసరావు, ఆప్ ప్రతినిధి కె.హరినాధ బాబు, వైసప్రతినిధి ఉగ్గిన అప్పారావు, కాంగ్రెస్ ప్రతినిధి మీసాల సుబ్బన్న, జనసేన ప్రతినిధి డి.వేణుగోపాల కిరణ్, బిఎస్‌పి. ప్రతినిధి జి.సూరిబాబుపాల్గొన్నారు

పోలీసు పిజిఆర్ఎస్‌కు 60 ఫిర్యాదులు

అనకాపల్లి : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా పాల్గొని, 60 ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుల్లోభూ తగాదాలకు సంబంధించి 34, కుటుంబ కలహాలు, మోసపూరిత వ్యవహారాలకు మూడేసి, ఇతర విభాగాల ఫిర్యాదులు 20 ఉన్నాయి. ఎస్‌పి తుహిన్ సిన్హా మాట్లాడుతూ,ఫిర్యాదులను నిష్పక్షపాతంగా పరిశీలించి వాస్తవాలను నిర్ధారించుకుని వారం రోజుల్లో విచారణ పూర్తిచేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.